


# నేటి నిజం

తెలుగు దినపత్రిక

website:www.netinijam.com

E-mail : netinijam93@gmail.com






హైదరాబాద్ | శనివారం 17-10-2020 | RNI No.52865/93-Postal No\.H/SD/258/2018-2020 | ఎడిటర్: బైస దేవదాస్: సెల్:9000065433 | సంపుటి:27 | సంచిక:65 | పేజీలు:4 | వెల: రూ.1/-


# మహిళలకు మంత్రి బతుకమ్మ శుభాకాంక్షలు

## ఆనందోత్సాహాల మధ్య పండుగ జరుపుకోవాలని ఆకాంక్ష

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): రాష్ట్ర గిరిజన, స్త్రీ-శిశు సంక్షేమ శాఖల మంత్రి సత్యవతి రాథోడ్ తెలంగాణ మహిళలకు బతుకమ్మ పండగ శుభాకాంక్షలు తెలిపారు. బతుకమ్మ పండుగ ప్రారంభమయ్యే ఎంగిలిపూల బతుకమ్మ పండుగను మహిళలందరూ ఆనందోత్సాహాల మధ్య జరుపుకోవాలని కోరారు. మహిళలు ఎంతో ఇష్టంతో పూలను పేర్చి, గౌరమ్మను తీర్చి కోరిన కోరికలు ఫలించాలనే నమ్మకంతో ఈ బతుకమ్మ పండగ చేసుకుంటారని, అది ఎంగిలిపూల బతుకమ్మతో మొదలవుతుందని మంత్రి సత్యవతి తెలిపారు. తెలంగాణ రాష్ట్ర ఏర్పాటు తర్వాత బతుకమ్మ పండుగను రాష్ట్ర పండుగగా సీఎం కేసీఆర్ ప్రకటించారని ఆమె గుర్తు చేశారు. బతుకమ్మ పండుగను మహిళలందరూ ఘనంగా నిర్వహించుకోవాలనే ఉద్దేశంతో.. ప్రతి ఆడబిడ్డకు ప్రభుత్వం బతుకమ్మ చీరలను ప్రతి ఏటా అందజేస్తుందని తెలిపారు. బతుకమ్మ పండుగ తెలంగాణ అస్థిత్వానికి ప్రతీక అని పేర్కొన్నారు. తెలంగాణ రాష్ట్రంలో మహిళల సంక్షేమం, అభివృద్ధి, భద్రతకు ప్రభుత్వం అత్యంత ప్రాధాన్యత ఇస్తుందని మంత్రి స్పష్టం చేశారు.

ఖమ్మం బాలిక మృతిపై మంత్రి విచారం

ఖమ్మం జిల్లాకు చెందిన నర్సమ్మ అనే బాలికపై దుండగులు అత్యాచారం చేసి, పెట్రోల్ పోసి నిప్పంటించిన విషయం విదితమే. బాధితురాలు హైదరాబాద్‌లోని రెయిన్‌బో ఆస్పత్రిలో చికిత్స పొందుతూ గురువారం రాత్రి మృతి చెందింది. నర్సమ్మ మృతి పట్ల మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ మంత్రి సత్యవతి రాథోడ్ సంతాపం వ్యక్తం చేశారు. మృతురాలి కుటుంబ సభ్యులకు ప్రగాఢ సానుభూతి తెలిపారు. కూతురు మరణంతో తీవ్ర శోకసంద్రంలో ఉన్న ఆమె తల్లిదండ్రులకు ప్రభుత్వం పూర్తిగా అండగా ఉంటుందని, ఆదుకుంటుందని మంత్రి భరోసా ఇచ్చారు. తమ బిడ్డను కచ్చితంగా కాపాడాలని, సత్వర చికిత్స కోసం ప్రైవేట్ హాస్పిటల్ కు తరలించాలని నర్మమ్మ తల్లిదండ్రులు వెంకటమ్మ, ఉప్పలయ్యల విజ్ఞప్తి మేరకు మంత్రి సత్యవతి రాథోడ్.. బాధితురాలిని రెయిన్ బో హాస్పిటల్‌కు తరలించి వైద్యం అందించారు. మంత్రి ఆదేశాలతో మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖల ప్రత్యేక కార్యదర్శి, కమిషనర్ దివ్య స్వయంగా వెళ్లి బాలికను ఉస్మానియా హాస్పిటల్ నుంచి రెయిన్ బో హాస్పిటల్ కు తరలించి గత వారం రోజులుగా ప్రభుత్వ ఖర్చుతో వైద్యం అందిస్తున్నారు. దురదృష్టవశాత్తు తీవ్రంగా గాయపడిన బాలిక వైద్యం అందించినప్పటికీ నిన్న రాత్రి మరణించడం అత్యంత బాధాకరమని, ఇలాంటి ఘటనలకు పాల్పడిన వారిని ఎట్టి పరిస్థితుల్లో ఉపేక్షించేది లేదని మంత్రి సత్యవతి రాథోడ్ తెలిపారు. బాలిక కుటుంబానికి కావల్సిన సాయాన్ని ప్రభుత్వం అందించేలా చర్యలు తీసుకోవాలని మహిళాభివృద్ధి, శిశు సంక్షేమ శాఖ కమిషనర్ ను ఆదేశించారు.

# సీఎం కేసీఆర్ బతుకమ్మ శుభాకాంక్షలు

హైదరాబాద్,అక్టోబర్16 (ఆర్ఎన్ఎ): తెలంగాణ ప్రజలకు ముఖ్యమంత్రి కే.చంద్రశేఖర్‌రావు బతుకమ్మ పండుగ శుభాకాంక్షలు తెలిపారు. తెలంగాణ ఆత్మగౌరవ ప్రతీకగా, తెలంగాణ సాంస్కృతిక వైభవానికి చిహ్నంగా నిలుస్తున్న బతుకమ్మ పండుగను ప్రజలు భక్తి శ్రద్ధలతో జరుపుకోవాలని సీఎం కేసీఆర్ పిలుపునిచ్చారు. పంటలు బాగా పండి వ్యవసాయం గొప్పగా వర్ధిల్లాలని, ప్రతీ ఇంట్లో సుఖ సంతోషాలు వెల్లివిరిసేలా దీవించాలని అమ్మవారిని ముఖ్యమంత్రి ప్రార్థించారు. కరోనా నిబంధనలు పాటిస్తూ ప్రజలు పండుగ జరుపుకోవాలని కోరారు. కరోనా నేపథ్యంలో అన్ని జాగ్రత్తలు తీసుకుంటూ, సురక్షితంగా, సంతోషంగా బతుకమ్మ పండుగను జరుపుకోవాలని నిజామాబాద్ ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా ఆమె ఆడపడుచులకు బతుకమ్మ శుభాకాంక్షలు తెలిపారు. 'బతుకమ్మ పండుగ స్ఫూర్తితో మనందరం ఉమ్మడిగా కరోనాను ఎదుర్కొందాం. ఎక్కువ మంది ఒకేచోట గుమిగూడకూడదు. కరోనా కారణంగా ఈ ఏడాది, తెలంగాణ జాగృతి ఆధ్వర్యంలో బతుకమ్మ కార్యక్రమాలు నిర్వహించడం లేదు.' అని ట్విటర్ ద్వారా ఎమ్మెల్సీ కవిత ప్రత్యేక సందేశం విడుదల చేశారు.

# ఫుడ్ ప్రోగ్రామ్‌కు నోబెల్ బహుమతి గర్వకారణం

## ఆహార సరఫరాలో భారత్ పాత్ర అమోఘం
## పోషకాహారం కోసం ఎంతగానో కృషి చేస్తున్నాం
### -ప్రధాని మోడీ




న్యూఢిల్లీ,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): వరల్డ్ ఫుడ్ ప్రోగ్రామ్‌కు ఈ ఏడాది నోబెల్ శాంతి బహుమతి దక్కడం గొప్ప విషయని ప్రధాని మోదీ అన్నారు. వరల్డ్ ఫుడ్ డే సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. ఆహార సరఫరా విషయంలో భారత పాత్ర, భాగస్వామ్యం చరిత్రాత్మకమైందన్నారు. ప్రపంచవ్యాప్తంగా పోషకాహారలోపాన్ని తొలగించడానికి నిరంతరం కృషి చేస్తున్న వారిని అభినందిస్తున్నట్లు ప్రధాని తెలిపారు. భారతదేశంలోని రైతులు, అన్నదాతలు, వ్యవసాయ శాస్త్రవేత్తలు, అంగన్వాడీ-ఆశా కార్యకర్తలు పోషకాహార లోపానికి వ్యతిరేకంగా ఉద్యమం చేస్తున్నట్లు వెల్లడించారు. వీరందరి పరిశ్రమ వల్లే దేశం అన్నక్షేత్రంగా వర్ధిల్లుతున్నట్లు ఆయన తెలిపారు. పేదల వద్దకు ప్రభుత్వం చేరడంలో వీరి సహకారం ఎంతో ఉందన్నారు.

కరోనా సంకట సమయంలోనూ రైతుల సహకారం వల్లే పోష్టికాహార లోపంపై బలమైన పోరాటం చేశామన్నారు. 2014 తర్వాత దేశంలో కొత్త చరిత్ర ప్రారంభమైందని, సమగ్ర విధానం రూపంలో ముందుకు సాగుతున్నట్లు ఆయన చెప్పారు. 2023ని ఇంటర్నేషనల్ ఇయర్ ఆఫ్ మిల్లెట్స్‌గా ఎఫ్ఏవో ప్రకటించిందని, దానికి భారత మద్దతు పూర్తిగా ఉంటుందన్నారు. పోషకాహార సమస్యను అధిగమించేందుకు 17 రకాల కొత్త వంగడాలను రిలీజ్ చేస్తున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. చిన్న రైతులను బలోపేతం చేయడానికి .. ఎఫ్‌పీవోల నెట్వర్క్‌ను ఏర్పాటు చేస్తున్నట్లు ఆయన వెల్లడించారు. మహిళల వివాహ వయసుకు సంబంధించి చర్చలు జరుగుతున్నట్లు ప్రధాని మోదీ తెలిపారు. అయితే దీనిపై ఏర్పాటు చేసిన కమిటీ ఎందుకు నిర్ణయం తీసుకోవడం లేదని దేశం నలుమూలల నుంచి ఆడ కూతుళ్లు లేఖలు రాస్తున్నట్లు ఆయన తెలిపారు. అయితే నివేదిక వచ్చిన వెంటనే.. పెళ్లి వయసుకు సంబంధించి చర్యలు తీసుకోనున్నట్లు మోదీ చెప్పారు. ఐక్యరాజ్యసమితి ఆధ్వర్యంలోని ఫుడ్ అండ్ అగ్రికల్చర్ ఆర్గనైజేషన్(ఎఫ్ఏవో)కు 75 ఏళ్లు నిండాయి. ఈ నేపథ్యంలో ఇవాళ ప్రధాని మోదీ .. 75 రూపాయాల స్మారక నాణాన్ని రిలీజ్ చేశారు. ఈ సందర్భంగా ఆయన ఎనిమిది పంటలకు సంబంధించిన 17 రకాల బయోఫోర్టి÷డ్ వెరైటీలను కూడా జాతికి అంకితం చేశారు. ఇవాళ ప్రపంచ వ్యాప్తంగా వరల్డ్ ఫుడ్ డేను కూడా సెలబ్రేట్ చేసుకుంటున్నారు.

# మహారాష్ట్రను అతలాకుతలం చేస్తున్న భారీ వర్షాలు

## భారీ వర్షాలకు 28మంది మృత్యువాత



పుణె,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): మహారాష్ట్రలో కురుస్తున్న భారీవానల వల్ల మరణిస్తున్నవారి సంఖ్య క్రమంగా పెరుగుతున్నది. పుణె డివిజన్‌లోని సాంగ్లీ, సతారా, పుణె, షోలాపూర్ జిల్లాల్లో కురుస్తున్న భారీవర్షాల వల్ల ఇప్పటివరకు 28 మంది మరణించారు. వరదల్లో గల్లంతైనవారిలో ఇంకొకరి ఆచూకీ లభించలేదు. గత రెండు రోజులు దేశ ఆర్థిక రాజధాని అయిన ముంబైతోపాటు పుణె, సాంగ్లీ, షోలాపూర్, సతారా జిల్లాల్లో భారీగా వర్షాలు కురుస్తున్నాయి. దీంతో లోతట్టుప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోయింది. ఆయా ప్రాంతాల్లో నివాసముంటున్న 29,292 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని అధికారులు చెప్పారు. 2319 ఇళ్లు ధ్వసమయ్యాయని, 57,354 హెక్టార్లలో పంట నీటమునిగిందని అధికారులు వెల్లడించారు.

దేశ ఆర్థిక రాజధాని నగరమైన ముంబైతో పాటు పూణెళి, షోలాపూర్, సాంగ్లీ జిల్లాల్లో భారీవర్షాల వల్ల పలు లోతట్టుప్రాంతాల్లో వరదనీరు నిలిచిపోయింది. లోతట్టుప్రాంతాల్లో నివాసముంటున్న 20వేల మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని అధికారులు చెప్పారు. గత రెండు రోజులుగా పూణెళి, షోలాపూర్, సాంగ్లీ, సతారా, కొల్హాపూర్ జిల్లాల్లో భారీవర్షం కురుస్తోంది. పూణెళి, షోలాపూర్, సాంగ్లీ జిల్లాల్లో వరదల వల్ల 28 మంది మరణించారు. షోలాపూర్ జిల్లాలో 14 మంది, సాంగ్లీ జిల్లాలో 9 మంది, పూణెళి జిల్లాలో నలుగురు మరణించారని పూణెళి డివిజనల్ కమిషనర్ చెప్పారు. షోలాపూర్ జిల్లా పంధార్ పూర్ పట్టణంలో గోడ కూలిపోవడంతో ఆరుగురు మరణించారు. ఉజ్జయిని డ్యామ్ నుంచి నీరా, భీమా నదుల్లోకి వరదనీటిని విడుదల చేశారు. నదీ తీర ప్రాంత పంధార్ పూర్ తహసీల్ పరిధిలోని గ్రామాల ప్రజలను సురక్షిత ప్రాంతాలకు తరలించామని షోలాపూర్ సబ్ డివిజనల్ ఆఫీసర్ చెప్పారు. పంధార్ పూర్ పట్టణంలో 1650 మందిని సురక్షిత ప్రాంతాలకు తరలించామని నేషనల్ డిజాస్టర్ రెస్పాన్స్ అధికారులు చెప్పారు. పూణెళి నగరంలో బుధవారం ఉరుములు, మెరుపులతో భారీవర్షం కురిసింది. ముంబై నగరంలో భారీవర్షాల వల్ల శుక్రవారం ఎల్లో అలర్ట్ జారీ చేశారు. మహారాష్ట్రలో భారీవర్షాల వల్ల హైఅలర్ట్ ప్రకటిస్తున్నట్లు ముఖ్యమంత్రి ఉద్ధవ్ థాక్రే చెప్పారు. ఆర్మీ, నేవీ, ఎయిర్ ఫోర్స్ బృందాలను రంగంలోకి దించాలని నిర్ణయించారు. 96 మిల్లీమీటర్లు, కొల్హాపూర్ లో 56 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదైంది.

ముంబై నగరంలో గురువారం రాత్రి

# విషమంగా నాయిని ఆరోగ్యం

## ఊపిరితిత్తుల ఇన్‌ఫెక్షన్ సోకినట్లు గుర్తింపు
## అపోలోలో వెంటిలేటర్‌పై చికిత్స

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): మాజీ హోంమంత్రి నాయిని ఆరోగ్య పరిస్థితి విషమంగా ఉంది. ప్రస్తుతం ఆయనకు అపోలో వైద్యులు వెంటిలేటర్‌పై ఉంచి చికిత్సను అందిస్తున్నారు. ఊపిరితిత్తుల్లో ఇన్ఫెక్షన్ చేరడంతో మళ్లీ నాయిని ఆస్పత్రిలో చేరారు. ఇటీవల నాయిని నరసింహారెడ్డి అస్వస్థతకు గురయ్యారు. ఊపిరితిత్తుల ఇన్ఫెక్షన్‌తో ఆయన ఆస్పత్రిలో చేరారు. కొద్ది రోజుల క్రితం నాయికి కరోనా సోకింది. చికిత్స తీసుకోవడంతో కోలుకున్నారు. అయితే కరోనా కంటే ముందే నాయినికి గుండె ఆపరేషన్ జరిగింది. ప్రస్తుతం విశ్రాంతి తీసుకుంటున్నారు. ఈ సమయంలో నాయిని మరోసారి అస్వస్థతకు గురయ్యారు. అపోలో ఆసుపత్రిలోని అడ్వాన్స్‌డ్ క్రిటికల్ కేర్ యూనిట్‌లో వెంటిలేటర్‌పై చికిత్స పొందుతున్నారు. గత నెల 28వ తేదీన కరోనా బారినపడ్డ నాయిని సిటీ న్యూరో సెంటర్ ఆసుపత్రిలో చేరి 16 రోజులు చికిత్స పొందారు. వారం రోజుల క్రితం కరోనా పరీక్షలు నిర్వహించగా నెగెటివ్ కూడా వచ్చింది. త్వరలోనే ఆయన కోలుకుని ఇంటికి వస్తారనుకున్న సమయంలో ఒక్కసారిగా ఊపిరి తీసుకోవడమే కష్టంగా మారింది. దీంతో పరీక్షలు నిర్వహించగా ఊపిరితిత్తులకు ఇన్‌ఫెక్షన్ అయి న్యుమోనియా సోకిందని డాక్టర్లు తేల్చారు. దీంతో నాయిని ఆక్సిజన్ లెవల్స్ పడిపోయాయి. ఆందోళన చెందిన కుటుంబ సభ్యులు మంగళవారం ఆయనను హుటాహుటిన అపోలో ఆసుపత్రికి తరలించారు. అక్కడ పల్మనాలజీ స్పెషలిస్ట్ డాక్టర్ సునీతారెడ్డి, కిడ్నీ స్పెషలిస్టు డాక్టర్ రవి ఆండ్రూస్, మరో డాక్టర్ కె.వి. సుబ్బారెడ్డిల పర్యవేక్షణలో అత్యవసర చికిత్స అందిస్తున్నారు. ఇదిలా ఉండగా నాయిని భార్య అహల్యకు కూడా కరోనా సోకింది. ఆమె కూడా బంజారాహిల్స్‌లోని సిటీ న్యూరో సెంటర్‌లో చికిత్స పొందుతున్నారు. ప్రస్తుతం ఆమెకు పరీక్షలో నెగెటివ్ వచ్చినప్పటికీ ఆసుపత్రిలోనే ఉండి మెరుగైన చికిత్స తీసుకుంటున్నారు. అలాగే నాయిని అల్లుడు, రాంనగర్ డివిజన్ కార్పొరేటర్ వి.శ్రీనివాస్‌రెడ్డి, ఆయన పెద్ద కుమారుడు కూడా కరోనా బారిన పడి ఇప్పుడిప్పుడే కోలుకుంటున్నారు. లాక్‌డౌన్‌తోపాటు కరోనా

ఉధృతంగా ఉన్న సమయంలో ఇంటికే పరిమితమైన నాయిని నరసింహారెడ్డి ఇటీవల ముషీరాబాద్‌లో జరిగిన కొండాలక్ష్మణ్ బాపూజీ జయంతి కార్యక్రమంలో పాల్గొని అభిమానులు అందించిన కేక్‌ను తిన్నారు. అలాగే ఓ మతపెద్ద ఇంటి ప్రహరీ గోడ కూలిన సమయంలో పరామర్శించేందుకు వెళ్లారు. దానికి తోడు ఓ మతపెద్ద సన్మాన కార్యక్రమంలో కూడా పాల్గొన్నారు. ఇక్కడే ఎక్కడో నాయినికి కరోనా సోకి ఉంటుందని కుటుంబ సభ్యులు భావిస్తున్నారు.

# స్నేహం ముసుగులో దారుణం

## యువతిపై ముగ్గురు మృగాళ్ల అత్యాచారం
## బర్త్‌డే కేకులో మత్తు మందు కలిపి అఘాయిత్యం
## యువతి ఫిర్యాదుతో పోలీసులు దర్యాప్తు

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): రోజురోజుకీ మృగాలు రెచ్చిపోతున్నారు.. అయినవాళ్లు ఎవరో.. అదునుకోసం చూసేవారు ఎవరో తెలియని పరిస్థితి.. అతుడు స్నేహితుడైనా నమ్మే పరిస్థితి లేకుండా పోయింది.. తాజాగా హైదరాబాద్‌లో మరో దారుణమైన ఘటన వెలుగుచూసింది.. స్నేహం ముసుగులో డిగ్రీ విద్యార్థినిపై దుర్మార్గులు సామూహిక లైంగికదాడికి పాల్పడ్డారు. కూకట్‌పల్లిలో ఈ దారుణం చోటు చేసుకుంది. స్నేహం ముసుగులో యువతిపై అత్యాచారం జరిపిన ఘటన స్థానికంగా కలకలం రేపింది. జూబ్లీహిల్స్‌కు చెందిన డిగ్రీ విద్యార్థినిపై ముగ్గురు యువకులు అత్యాచారానికి పాల్పడ్డారు. బర్త్‌డే కేకులో మత్తు మందు కలిపి యువతిపై అత్యాచారం జరిపారు. విషయం బయటకు చెబితే చంపేస్తామంటూ యువతిని బెదిరించారు. బాధితురాలు తీవ్ర అస్వస్థతకు గురి కావడంతో తల్లిదండ్రులు ఆస్పత్రికి తరలించారు. తల్లిదండ్రులు నిలదీయండంతో యువతి జరిగిన విషయం చెప్పింది. నిందితులు జోసెఫ్, రాము, నవీన్‌పై పీఎస్‌లో తల్లిదండ్రులు ఫిర్యాదు చేశారు. ఆలస్యంగా ఈ ఘటన వెలుగులోకి వచ్చింది. పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. వివరాల్లోకి వెళితే..బర్త్‌డే ఉందంటూ తీసుకెళ్లి.. కేక్‌లో మత్తుమందు కలిపి అఘాయిత్యానికి పాల్పడ్డారు. ఈ విషయం బయటకు చెబితే చంపేస్తామని బెదిరింపులకు దిగారు.. బాధితురాలు విషయం ఇంట్లో వారికి చెప్పడంతో ఘటన వెలుగు చూసింది. జూబ్లీహిల్స్‌లో ఉంటున్న ఓ యువతి సికింద్రాబాద్‌లోని కళాశాలలో డిగ్రీ చదువుతోంది. ఇంటి దగ్గర ఆ యువతికి ముగ్గురు అబ్బాయిలతో స్నేహం ఉంది. బర్త్‌డే ఉందని నమ్మబలికిన ఓ యువకుడు. మిగతా ఇద్దరు ఫ్రెండ్స్‌తో కలిసి సెలబ్రేట్ చేసుకుందామని ప్రతిపాదించాడు. స్నేహితులన్న నమ్మకంతో యువతి అంగీకారం తెలిపింది. కళాశాల నుంచే నలుగురూ ఓ హోటల్‌కు వెళ్లారు. పథకం ప్రకారం ముందుగా కేక్‌పై మత్తుమందు చల్లారు. అందరం కలిసి తిందామని యువతి అనగా.. ముందు నువ్వే తినాలంటూ ఆమెకే తినిపించారు. వెంటనే ఆ యువతి మత్తులోకి జారుకోవడంతో.. ముగ్గురూ ఆమెపై సామూహిక అత్యాచారానికి పాల్పడ్డారు. ఆ తర్వాత ఈ విషయం ఎవరికైనా చెబితే చంపేస్తామంటూ బెదిరించిన ముగ్గురు యువకులు.. ఆమెను ఆటోలో ఇంటికి పంపించేశారు. తీవ్ర అస్వస్థతకు గురైన బాధితురాలు.. ఈనెల 11న అపస్మారకస్థితికి వెళ్లగా.. తల్లిదండ్రులు ఆసుపత్రిలో చేర్పించారు. తనపై జరిగిన అఘాయిత్యాన్ని తల్లిదండ్రులకు తెలిపిన బాధితురాలు బోరున విలపించింది. దీంతో, రెండు రోజుల క్రితం జూబ్లీహిల్స్ పోలీసులకు ఫిర్యాదు చేశారు. జోసెఫ్, రాము, నవీన్‌లపై పోలీసులకు ఫిర్యాదు చేసినట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. ఘటన సైబరాబాద్ పరిధిలో జరగడంతో జీరో ఎఫ్.ఐ.ఆర్. నమోదు చేసి సైబరాబాద్ పోలీసులకు బదిలీ చేశారు.

# వరదప్రాంతాల్లో అత్యవసర వైద్య సేవలు

## అందుబాటులోకి నిత్యావసర సరుకులు
## నీరు కాచి తాగాలన్న మంత్రి కెటిఆర్
## మూడోరోజూ కొనసాగిన మంత్రి పర్యటన

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): వరద ముంపు ప్రాంతాల్లో ప్రజలకు అవసరమైన వైద్య సదుపాయాలు అందిస్తామని రాష్ట్ర పురపాలక శాఖమంత్రి కేటీఆర్ స్పష్టం చేశారు.నగరంలో ప్రజలు తాగునీటి విషయంలో కొన్ని రోజులు జాగ్రత్తలు తీసుకోవాలని మంత్రి సూచించారు. కాచివడపోసిన నీటిని తాగడం వల్ల సీజనల్ వ్యాధుల నుంచి దూరంగా ఉండొచ్చు అని చెప్పారు. నగరంలోని వరద ప్రభావిత ప్రాంతాల్లో మంత్రి కేటీఆర్ మూడో రోజు విస్తృతంగా పర్యటించారు. ఖైరతాబాద్ నుంచి కేటీఆర్ పర్యటన మొదలైంది. అక్కడ జీహెచ్ఎంసీ ఏర్పాటు చేసిన షెల్టర్ హోమ్‌లను సందర్శించి.. మౌలిక సదుపాయాలపై ఆరా తీశారు. అనంతరం బేగంపేటలోని ప్రకాశ్ నగర్, బ్రాహ్మణవాడి ప్రాంతాలను పరిశీలించారు. ముంపునకు గురైన ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. రేషన్ కిట్లతో పాటు దుప్పట్లను స్థానికులకు కేటీఆర్ అందజేశారు. వరద నీరు తగ్గిన ప్రాంతాల్లో పారిశుద్ధ్య పనులను వేగవంతం చేయాలని అధికారులను కేటీఆర్ ఆదేశించారు. మంత్రి వెంట ఎమ్మెల్యే దానం నాగేందర్ తదితరులు ఉన్నారు.

### నాలాల ఆక్రమణలపై చర్యలు తప్పవు

నాలాలు, చెరువులు ఆక్రమించి నిర్మాణాలు చేపట్టిన వారిపై చర్యలు తీసుకుంటామని జీహెచ్ఎంసీ మేయర్ బొంతు రామ్మోహన్ అన్నారు. నిబంధనలు పాటించకుండా చేపట్టిన నిర్మాణాల కారణంగానే భారీ వర్షానికి ఇండ్లను వరద ముంచెత్తిందని ఆయన పేర్కొన్నారు. నాలాలు, చెరువులపై అక్రమ నిర్మాణాలను యుద్ధప్రాతిపదికన తొలగిస్తామని చెప్పారు. వీటిలో పేదల ఇండ్లు ఉంటే వారికి డబుల్‌బెడ్రూంలు కేటాయిస్తామన్నారు. నగరంలో రూ. 5కోట్లతో నాలాల ఆధునీకరణ పనులు చేపట్టనున్నట్లు తెలిపారు. శిథిల భవనాల కూల్చివేత ప్రక్రియ వేగవంతం చేశామని, తొలుత కేసులు లేని భవనాలను కూల్చివేస్తున్నామని ఆయన వెల్లడించారు. నగరంలో ఈ ఏడాది శిథిలావస్థలో ఉన్న దాదాపు 300 భవనాలను కూల్చివేసినట్లు పేర్కొన్నారు. భారీ వర్షం కారణంగా 160 పునరావాస కేంద్రాల్లో లక్షమందికి ఆశ్రయం కల్పించినట్లు చెప్పారు. రెండు, మూడు రోజుల్లో నగరంలో సాధారణ పరిస్థితులు నెలకొనే అవకాశముందన్నారు.

### చరిత్రలో నేటినిజం



కం॥ విరాంగనగా వెలుగుచు
కారతు వంశము నుమెట్టి కాప్రేడుగుచునే
పోరాటము నకు రూపుగ
పేరును ప్రఖ్యాతిని గానె 'బృందా కారత్'!!

( అక్టోబర్ 17 బృందాకారత్ జననం..)



-రాధశ్రీ
సెల్: 9494481210

# నీటి విడుదలలో కాలనీ వాసుల మధ్య గొడవ

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): హైదరాబాద్ నగరంలోని వనస్థలిపురంలో కాలనీవాసుల మధ్య వివాదం చోటు చేసుకుంది.

వరద నీరు తరలింపు విషయంలో కాలనీ వాసుల మధ్య ఘర్షణ చెలరేగింది. హరిహరపురం నుంచి దిగువకు నీరు వెళ్లడానికి స్థానికులు కాలువకు గండి కొట్టారు. దీన్ని గాంధీనగర్, స్నేహమయినగర్ కాలనీ వాసులు అడ్డుకున్నారు.

దీంతో ఘర్షణకు దిగిన ఇరు కాలనీ వాసులు కర్రలతో పరస్పరం దాడులకు పాల్పడ్డారు. ఈఘటనలో పలువురు తీవ్రంగా గాయపడ్డారు

. వెంటనే వారిని ఆస్పత్రికి తరలించారు. కాలనీ ప్రెసిడెంట్ హనుమతరెడ్డి సహా మరో నలుగురిపై పోలీసులు కేసు నమోదు చేశారు.

# బాలికపై సామూహిక అత్యాచారకేసు

## -దోషులకు మరణశిక్ష విధించిన కోర్టు

లక్నో,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): ఉత్తరప్రదేశ్‌లోని హపూర్ జిల్లాలో రెండేళ్ల క్రితం సంచలనం సృష్టించిన 12ఏండ్ల బాలికపై సామూహిక లైంగికదాడి, హత్యకేసులో గురువారం కోర్టు సంచలనాత్మక తీర్పునిచ్చింది. ఇద్దరు నిందితులకు ప్రత్యేక కోర్టు జడ్జి (పోక్సో చట్టం) వీణ నారాయణ్ మరణశిక్ష విధిస్తూ తీర్పుచెప్పారు. బాలిక తమ్ముడు కేసులో ప్రధాన సాక్షి అయ్యాడని పబ్లిక్ ప్రాసిక్యూటర్ హరేంద్ర త్యాగి తెలిపారు. ఘటనకు కొన్నినెలల ముందు నిందితులు అంకుర్ తేలి, సోను బాలిక ఇంట్లో పనికి చేరారు. సెప్టెంబర్ 9, 2018న బాలిక తల్లిదండ్రులు ఇంటి నుంచి బయటకు వెళ్లగా బాలికతోపాటు ఆమె తమ్ముడు(10) ఒంటరిగా ఉన్నారు. బాలికపై ఇద్దరు లైంగికదాడికి యత్నిస్తుండగా ఆమె తమ్ముడు అలారం మోగించేందుకు ప్రయత్నిస్తుండగా అతడి గొంతుకోశారు. చనిపోయాడని భావించి వదిలేసి బాలికపై లైంగికదాడి చేసి చంపి సమీపంలోని గోడౌన్‌లో మృతదేహాన్ని దాచారు. ఇంటికి వచ్చిన తండ్రికి రక్తపు మడుగులో కుమారుడు కనిపించడంతో హుటాహుటిన దవాఖానకు తరలించాడు. కోలుకున్న అతడు ఏం జరిగిందో తల్లిదండ్రులకు చెప్పాడు. బాలిక మృతదేహాన్ని గోడౌన్‌లో గుర్తించి స్వాధీనం చేసుకున్న పోలీసులు పలు సెక్షన్ల కింద కేసు నమోదు చేసి దర్యాప్తు ప్రారంభించారు. ఇద్దరు నిందితులను అరెస్టు చేసి అక్టోబర్ 28న కోర్టులో ఛార్జిషీట్ దాఖలు చేశారు. భౌతిక, ఫోరెన్సిక్ నివేదిక ఆధారంగా 18 మంది సాక్షులను కోర్టులో హాజరుపర్చారు. వాదోపవాదాలు, సాక్ష్యాధారాలను పరిశీలించిన న్యాయమూర్తి ఇద్దరు నిందితులకు మరణశిక్ష విధిస్తూ తీర్పునిచ్చారు. కేసులో అమర్ జీత్ అనే మరోవ్యక్తిని నేరస్తుడిగా గుర్తించినా సరైన సాక్ష్యాధారాలు లభించనందున అతడిని నిర్దోషిగా కోర్టు పేర్కొందని ఎస్పీ సర్వేశ్ మిశ్రా తెలిపారు.

# కరోనాతో బీహార్ మంత్రి మృతి

## చికిత్స పొందుతూ మృతి చెందిన కపిల్

పాట్నా,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): జనతాదళ్ యునైటెడ్ సీనియర్ నాయకుడు, బీహార్ పంచాయతీ రాజ్ శాఖ మంత్రి కపిల్ డియో కామత్ (69) కరోనా బారిన పడి మృతిచెందారు. కరోనాతో పాట్నాలోని ఆల్ ఇండియా ఇన్స్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ ఎయిమ్స్‌లో చికిత్స పొందుతున్న ఆయన.. శుక్రవారం తెల్లవారుజామున కన్నుమూశారు. ఆయన గత కొన్ని రోజు లుగా ఇదే ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నాడు. ఆయన కరోనా సోకకముందే.. కిడ్నీ వ్యాధితో బాధపడుతున్నారు. దానికితోడు కరోనా సోకడంతో ఆయన ఆరోగ్యం మరింత విషమించింది. ఆయనను వెంటిలేటర్ మీద ఉంచి చికిత్స అందించినప్పటికీ ఎటువంటి ఉపయోగం లేకుండా పోయింది. కామత్ మృతి పట్ల బీహార్ సీఎం నితీష్ కుమార్ తన సంతాపాన్ని తెలియజేశారు. కామత్ గ్రౌండ్ వర్క్ లీడర్ అని నితీష్ అన్నారు. నియోజకవర్గ ప్రజల కోసం ఎల్లప్పుడూ పరితపించేవారని ఆయన అన్నారు. 'కామత్ నైపుణ్యం కలిగిన నిర్వాహకుడు మరియు ప్రజాదరణ పొందిన రాజకీయ నాయకుడు. ఆయన మరణంతో నేను వ్యక్తిగతంగా బాధపడు తున్నాను. ఆయన మరణం రాజకీయ మరియు సామాజిక రంగాలలో కోలుకోలేని నష్టాన్ని కలిగించింది. ఆయన అంత్యక్రియలు ప్రభుత్వ లాంఛనాలతో గౌరవంగా జరుగుతాయి' అని నితీష్ కుమార్ ఒక ప్రకటనలో తెలిపారు.

# బతుకమ్మకు ముందే.. ఆగమైన బతుకులు !

నేటినిజం
శనివారం 17-10-2020

కరోనా కలకలం నుంచి ఇంకా బయటపడలేదు. ఎన్నో పండగలను అది మింగేసింది. పండగల వేళ జాగ్రత్తగా ఉండాలని..అది కూడా దసరా, దీపావళి ఉత్సావల సందర్భంగా జనసమూహం లేకుండా చూసుకోవాలని కేంద్రం ఇటీవలే హెచ్చరించింది. అయితే అంతకుముందే ప్రకృతి ప్రకోపించింది. భారీ వర్షాలు బతుకమ్మ పండగల ఆశలపై నీళ్లు చల్లాయి. పండగకు ముందే బతుకులు నీట మునిగాయి. తెలంగాణలో ఎంతో ఆర్భాటంగా జరుపుకునే ఈ పండగకు ముందే ప్రజలు నీట మునిగారు. ఆస్తుఉల నీట మునిగాయి. పంటలు నీట మునిగాయి. ఈ దశలో ఇక బతుకమ్మ ఆడుకోవడం అన్నది ఆలోచనలేని పండగగా మారింది. కరోనా పడగెత్తడంతో ఇప్పటికే అనేక పండగలకు ప్రజలు దూమయ్యారు. జంటనగరా ల్లో వేలాది కటుంబాలు నీట మునిగాయి. వారికి బుతకమ్మ ఆలోచన అన్నది లేనేలేదు. పంటలు కోల్పోయిన రైతులు లబోదిబోమంటున్న వేళ వారికీ పండగ ఆలోచనలు లేవు. తమను ఆదుకునే వారు వస్తారా అని దీనంగా ఎదురు చూస్తున్నారు. మానవుడి జీవితంతో ముడిపడి ఉన్న ప్రతి వస్తువును ఆరాధనగా చూసి ప్రేమించి పూజించడం మన వారసత్వానికి నిదర్శనం. అందుకే ఆకాశం,నీరు,గాలి, నిప్పు,భూమిలను పంచభూతాలుగా పూజిస్తున్నాం. మనజీవన విధానం అంతా కూడా ప్రకృతితో మమేకమై ఉంది. ప్రకృతి ఆరాధన అన్నది భారతీయ సంస్కృతితో పెనవేసుకుని ఉంది. పుట్టలను,చెట్లను, పూలను పూజించే గొప్పతనం మనది. దేవీ నవరాత్రులు, బతుకమ్మ పండగలు ఈ కోవలోకే వస్తాయి. ప్రకృతిని పూజించే మహత్తరమైన వేడికలు ఇవి. ఇలాంటి ప్రకృతి రమణీయకతకు బతుకమ్మ నిదర్శనం. ఇదో రకంగా గౌరీపూజను చేయడం.. అమ్మవారికి శరన్నవరాత్రులు ఎలా జరుపుతామో తెలంగాణాలో 9రోజులపాటు బతుకమ్మ వేడుకలను అలా జరపడం ఆనవాయితీ.

ఈ 9 రోజుల్లో కూడా తీరొక్క పూలతో బతుకమ్మలను పేర్చి మహిళలంతా గుమిగూడా ఆడుకోవడం...ఆడపిల్లలను ఇంటికి రప్పించి వేడుక చేయడం పెద్ద సరదా.

తెలంగాణ లోగిళ్లలో కులాలకు అతీతంగా బతుకమ్మను పెద్ద ఎత్తున ఆడుతారు. తొమ్మిది రోజుల బతుకమ్మ వేడుకలు, నవరాత్రుల దేవీ పూజలతో అంతటా సందడి కనిపిస్తుంది. కానీ మనకు తెలియకుండానే జరిగిన..

జరుగుతన్న ప్రకృతి విధ్వంసంతో ప్రకృతి ప్రకోపించింది. ప్రకృతే మనపై పగబట్టిందా అన్న రీతిలో ఇప్పుడు జలఖడ్గం విసరింది. కాలనీలన్నీ చెరువులయ్యాయి. ఇళ్లన్నీ బతుకమ్మలా మునిగాయి. జనం దిక్కుతోచని విధంగా ఉన్నారు. తాగడానికి నీరు లేక, పిల్లలకు పాలు లేక, తినడానికి తిండి లేక ఇంకా నీటిలోనే మగ్గుతున్నారు. మనమెంతగా అభివృద్ది చెందినా.. తోణం సహాయం అందించే వ్యవస్థను ఏర్పాటు చేసుకోలేదు. మంళవారం రాత్రి కురిసిన భారీ వర్షం నగర జనజీవనాన్ని చిన్నాభిన్నం చేసింది. నీటమునిగిన కాలనీ వాసుల గోస ఎవరికీ పట్టడం లేదు. ఊళ్లలో చెరువులన్నీ నిండాయి. మత్తళ్లు పోస్తున్నాయి. ప్రకృతి రమణీయత వెల్లివిరుస్తోంది. కానీ ప్రజల్లో మాత్రం తీరని వేదన కనిపిస్తోంది. కరోనాతో ఊర్లకు వెళ్లలేని దుస్థితిలో ప్రకృతి ప్రకోపించింది. నీటి పడగెత్తడంతో గ్రామాల మధ్య రహదారులు దెబ్బతిన్నాయి. పంటలు పోయి ప్రజలు ఆవేదనలో ఉన్నారు. ఈ తరుణంలో బతుకమ్మను జరుపుకునే ఆలోచన ఎవరికీ రావడం లేదంటే అతిశయోక్తి కాదు. నగరబాధ మరోలా ఉంది. ఏటా తొలిరోజు బతుకమ్మలు జోరుగా సాగేవి. కానీ ఇప్పుడు ఎటు చూసినా వరద.. మోకాళ్ల లోతు బురద.. ఇప్పుడు వందలాది కాలనీలు నీటమునిగిన కారణంగా ఎటుచూసినా ఇదే దుస్థితి. వేలాది మందికి కంటి మీద కునుకు లేదు.. ఎప్పుడు తెల్లారుతుందా.. తెల్లారిన బతకులు ఎలా బయటపడతాయా అన్న ఆందోళనలో ఉన్నారు. వందేండ్లలో ఎన్నడూ లేనంత భారీ వానలు రాష్ట్ర రాజధానిని ముంచెత్తితే.. ప్రజలు ఆగమాగం అయ్యారు. ఆదుకునే వారు లేరా అని

ఆకాశం వేపు చూస్తున్నారు. చిన్న వానలకే డ్రైనేజీలు పొంగి జనం ప్రాణాలు తీసినా సర్కారు మేలుకో లేదు. ఆ నిర్లక్ష్యమే ఇప్పుడు ఏకంగా 31 మందిని బలితీసుకుంది. వరదల్లో కొట్టుకపోయిన కొందరి ఆచూకీ ఇప్పటికీ తెలియడం లేదు. వెంటనే స్పందించి వాళ్లను కాపాడాల్సిన అధికారులు చేతులెత్తేశారు. నాలాలు, లోతట్టు ప్రాంతాల్లోని రోడ్లు, చెర్వుల్లో వేలాది వాహనాలు కొట్టుకు పోయాయి. హైదరాబాద్‌లో వందలాది కాలనీలు మూడు రోజులుగా జల దిగ్బంధంలోనే ఉన్నాయి. చాలా కాలనీల్లో నడుంలోతు నీరు నిల్వ చేరటంతో ఇండ్ల నుంచి బయటకు రాలేక జనం ప్రాణాలు అరచేతిలో పెట్టుకున్నారు. మూసీ పరీవాహకంలో ఉన్న కాలనీలన్నీ ఇప్పటికీ వరద ఉధృతికి తల్లడిల్లుతున్నాయి. తమ గోడు పట్టించుకోకుండా ప్రభుత్వం ఇతరత్రా అంశాలకు పెద్దపీట వేయటం పట్ల నగర వాసుల్లో ఆగ్రహం పెల్లుబికుతోంది. హైదరాబాద్ లోని వివిధ ప్రాంతాలను చూసేందుకు వెళ్లిన మంత్రులు, టీఆర్ఎస్ ఎమ్మెల్యేలు, కార్పొరేటర్లకు ఈ నిరసన సెగ తగిలింది. నీటిలో మునిగిన కాలనీల్లోని జనం శాపనార్థాలు పెట్టారు. కరోనా విషయంలో మాదిరిగానే వరదల పైనా సర్కార్ నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్న విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. తుఫాన్లు, వరదలు వచ్చినప్పుడు, అకాల వర్షాలు కురిసినప్పుడు, అనుకోని విపత్తులు వచ్చినప్పుడు రాష్ట్రంలో దాని ప్రభావం ఎంతన్నది లెక్కలు వేస్తున్న వారు..ఎంత త్వరగా ప్రజలను ఆదుకోగలిగామన్నది చూడడం లేదు. విపత్తులు ముంచుకుని వస్తున్న వేళ ..ప్రజలకు తగిన సమాచారం ఇవ్వకపోవడమే కాదు.. వారిని హెచ్చరించిన దాఖలాలు లేవు. ఈ వానాకాలంలో ఇప్పటివరకు వరుసగా మూడుసార్లు భారీ వర్షాలతో పెద్ద ఎత్తున పంట నష్టం వాటిల్లింది. వర్షాలతో లక్షలాది ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. జల ప్రళయం హైదరాబాద్ సహా పలు ప్రాంతాలను చుట్టుముట్టింది. ఇంతటి విపత్తులో పండగల గురించి ప్రజలు ఆలోచన చేయడం లేదు. అయినా ఊరూరా బతుకమ్మ చీరల పంపిణీతో మంత్రులు,ఎమ్మెల్యేలు ఘనంగా ఊరేగుతున్నారు. నగరంలో ఉన్న ఎమ్మెల్యేలు ఎక్కడా కానరావడం లేదు. నీట మునిగిన ప్రజలను రక్షిద్దామన్న చొరవ చూపడం లేదు. బతుమ్మ మొత్తం జీవితాలనే ఆగం చేసింది. బతుకులన్నీ ఆగమైన వేళ పండగ మచ్చుకైనా కనిపించడం లేదు.

## సజావుగా ధాన్యం కొనుగోళ్లు

### మిల్లర్లు ప్రభుత్వానికి సహకరించాలి

### మంత్రి గంగుల కమలాకర్

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): వానాకాలం వరిధాన్యం కొనుగోలు సజావుగా సాగేందుకు రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని పౌరసరఫరాలశాఖ మంత్రి గంగుల కమలాకర్ మిల్లర్లకు విజ్ఞప్తిచేశారు. ఈసారి భారీగా వరి దిగుబడి పెరిగిన నేపథ్యంలో ధాన్యం కొనుగోలు సక్రమంగా జరిగేలా చూడాలని ఆయన అన్నారు. గురువారం తన నివాసంలో పౌరసరఫరాల సంస్థ ఛైర్మన్‌మారెడ్డి శ్రీనివాస్‌రెడ్డి, రాష్ట్ర రైస్ మిల్లర్స్ అసోసియేషన్ నాయకులు, జిల్లాస్థాయి రైస్ మిల్లర్ల అసోసియేషన్ నేతలతో మంత్రి సమావేశం నిర్వహించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్రంలో సుమారు 6వేల కొనుగోలు కేంద్రాల ద్వారా వానాకాలం వరి ధాన్యం సేకరించడానికి అంతా సిద్ధం చేసినట్టు చెప్పారు.

ప్రతి గ్రామంలో ఒక కొనుగోలు కేంద్రం ఏర్పాటు చేయాలని సూచించారు. వానాకాలం 2020-21 వరిసాగు విస్తీర్ణం 52.78 లక్షల ఎకరాలు (సన్నధాన్యం 34.45 లక్షల ఎకరాలు, దొడ్డు ధాన్యం 13.33 లక్షల ఎకరాలు) సాగు జరిగిందన్నారు. ఈ సీజన్‌లో సన్న రకాలు98.61 లక్షల మెట్రిక్‌టన్నులు, దొడ్డు రకాలు 33.33 లక్షల మెట్రిక్‌టన్నులు కలిపి మొత్తం 131.94 లక్షల మెట్రిక్‌టన్నుల ధాన్యం ఉత్పత్తి అంచనా వేసినట్టు తెలిపారు. ఇందులో నికరంగా కొనుగోలు కేంద్రాలకు 75 లక్షల మెట్రిక్‌టన్నులు వస్తుందని, దీనిని పౌరసరఫరాల సంస్థ ద్వారా కొనుగలుచేస్తామని తెలిపారు. ఇందుకు కొత్తవి 10.13 కోట్లు, పాతవి 8.63 కోట్లు మొత్తం కలిపి 18.76 కోట్లు మేరకు అవసరమైన గోనే సంచులు సమకూర్చుకోవాలని నిర్ణయించామన్నారు. గోనె సంచుల సమస్య ఉత్పన్నం కాకుండా కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరుపుతూ సరిపడ కొత్తగోనె సంచులు ఉండేలా చర్యలు తీసుకోవాలని అన్నారు.

## కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు నామినేషన్ దాఖలు

### కాంగ్రెస్‌ను గెలిపించి ప్రజా గొంతుకను వినిపించాలి

### -కాంగ్రెస్ నేతలు ఉత్తమ్, రేవంత్ రెడ్డిల పిలుపు

సిద్దిపేట,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): రాష్ట్రాన్ని మోసం చేసిన సీఎం కేసీఆర్‌కు బుద్ధి చెప్పేందుకే దుబ్బాక ఉప ఎన్నికలు వచ్చాయని టీపీసీసీ అధ్యక్షుడు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి అన్నారు. దుబ్బాక ఎన్నిక రాష్ట్రంలో మార్పునకు శ్రీకారమన్నారు. దుబ్బాక నియోజకవర్గంలో కాంగ్రెస్ నేతలు విస్తృతంగా పర్యటించారు.

దుబ్బాక ఉప ఎన్నికల్లో పోటీచేస్తున్న ప్రధాన పార్టీల అభ్యర్థులు నామినేషన్ దాఖలు చేశారు. బుధవారం బీజేపీ, టీఆర్ఎస్ అభ్యర్థులు నామినేషన్ పత్రాలను సమర్పించగా.. గురువారం కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి నామినేషన్ వేశారు. ఈ సందర్భంగా ఉత్తమ్ మాట్లాడుతూ దుబ్బాక ఎన్నికల్లో కాంగ్రెస్‌ను గెలిపించి కెసిఆర్ కళ్లు తెరిపించాలన్నారు. కెసిఆర్ కుటుంబ పాలనకు, అవినీతికి చరమగీతం పాడాలని అన్నారు. దుబ్బాకలో శ్రీనివాస్ రెడ్డి ని గెలిపించి ప్రశ్నించే గొంతుకను అసెంబ్లీకి పంపించాని ఉత్తమ్ అన్నారు. ప్రతి కాంగ్రెస్ కార్యకర్త సైనికుల పని చేయాలని పిలుపునిచ్చారు. ఈ సందర్భంగా టీపీసీసీ కార్యనిర్వాహఖ అధ్యక్షుడు ఎంపీ రేవంత్ రెడ్డి మాట్లాడుతూ.. నాలుగు సార్లు గెలిచిన రామలింగారెడ్డికి మంత్రి ఎందుకివ్వలేదని ఎంపీ రేవంత్‌రెడ్డి ప్రశ్నించారు. తెలంగాణ అభివృద్ధి చెందాలంటే టీఆర్ఎస్‌ను ఓడించాలని పిలుపునిచ్చారు. దుబ్బాక ఉప ఎన్నికల్లో టీఆర్ఎస్ అభ్యర్థిగా సోలిపేట రామలింగారెడ్డి కుమారుడిని కాదని ఆయన భార్య సుజాతను ఎందుకు నిలబెట్టారని ప్రశ్నించారు. సీనియర్ నేతగా, ఉద్యమ నాయకుడిగా గుర్తింపు పొందిన రామలింగారెడ్డిగా సీఎం కేసీఆర్ మంత్రిపదవి ఎందుకు ఇవ్వలేదని నిలదీశారు. అంతేకాకుండా సిట్టింగ్ ఎమ్మెల్యే మరణిస్తే వారి కుటుంబ సభ్యుడిని ఏకగ్రీవంగా ఎన్నుకునే సాంప్రదాయాన్ని కాంగ్రెస్ పార్టీ తొలినుంచి అనుసరిస్తోందని గుర్తుచేశారు. సాంప్రదాయానికి విరుద్ధంగా గతంలో ఖైరతాబాద్, నారాయణ్‌ఖేడ్, పాలేరు ఉప ఎన్నికల్లో కేసీఆర్ అభ్యర్థులను నిలబెట్టారని విమర్శించారు. ఆణిముత్యం లాంటి ముత్యంరెడ్డి కొడుకును భారీ మెజార్టీతో గెలిపించాలని ఓటర్లను అభ్యర్థించారు. రాష్ట్రం కోసం 11 వందల మంది పిల్లలు ఆత్మత్యాగాలు చేశారని, ప్రజలకు ఇచ్చిన హామీలను టీఆర్ఎస్ తుంగలో తొక్కిందని ఎంపీ కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి దుయ్యబట్టారు. దుబ్బాక అభివృద్ధి ముత్యంరెడ్డి హయాంలోనే జరిగిందని దుబ్బాక కాంగ్రెస్ అభ్యర్థి చెరుకు శ్రీనివాస్‌రెడ్డి చెప్పారు.

## బిజెపి నేతల గోబెల్ ప్రచారానికి నోబెల్ ఇవ్వాలి

### -ప్రచారంలో మండిపడ్డ మంత్రి హరీష్ రావు

సిద్దిపేట,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): సీఎం కేసీఆర్ నేతృత్వంలో టీఆర్ఎస్ ప్రభుత్వం సముద్రమంతా సాయం దుబ్బాకకు చేస్తే, బీజేపీ సాయం కాకి రెట్టంత అని మంత్రి హరీశ్‌రావు అన్నారు. సోషల్ మీడియాలో బీజేపీ చేసే గోబెల్స్ ప్రచారానికి నోబెల్ బహుమతి ఇవ్వాలన్నారు.

రాష్ట్ర బీజేపీ దళిత మోర్చ కౌన్సిల్ సభ్యుడు ఎల్లంతో పాటు దాదాపు 150 మంది అధికార టీఆర్ఎస్ పార్టీలో చేరారు. సిద్దిపేటలో జరిగిన ఈ కార్యక్రమంలో మంత్రి హరీశ్‌రావు వీరందరికీ గులాబీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఈ సందర్భంగా హరీశ్ మాట్లాడుతూ... ఉత్తమ్ కుమార్ దుబ్బాకు వస్తే వాళ్ల మైకులే ఫెయిల్ అయ్యాయి. పరాయి లీడర్లు, పరాయి కార్యకర్తలతో కాంగ్రెస్ మీటింగ్‌లు నడుస్తున్నాయన్నారు. కాంగ్రెస్, బీజేపీ పోటీ రెండో స్థానం కోసమేనన్నారు. టీఆర్ఎస్, కేసీఆర్ లేకపోతే ఉత్తమ్ జై తెలంగాణ అనే వాడా? రాదనుకున్న తెలంగాణను ప్రాణాలు ఫణంగా పెట్టి తెచ్చిన కేసీఆర్ దా మోసం లేక ఆంధ్ర నేతల మోచేతి నీళ్లు తాగి తెలంగాణకు అడ్డుపడిన మీదా మోసం ప్రజలకు ఉత్తమ్ కుమార్ రెడ్డి సమాధానం చెప్పాలని ప్రశ్నించారు. మోసాల చరిత్ర కాంగ్రెస్ పార్టీది. త్యాగాల చరిత్ర టీఆర్ఎస్ పార్టీదన్నారు.

## నేటినుంచి వేములవాడలో శరన్నవరాత్రి

వేములవాడ,అక్టోబర్16(నేటినిజం ప్రతినిధి): రాష్ట్రంలోనే ప్రసిద్ద పుణ్యక్షేత్రమైన శ్రీ వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి ఆలయంలో శరన్నవరాత్రమహోత్సవాలకు ముస్తాబైయింది. శనివారం నుంచి 9 రోజుల పాటు శ్రీ శరన్నవరాత్రుల మహోత్సవములు నిర్వహించేందుకు ఆలయ అధికారులు సిద్దమయ్యారు. 9 రోజుల పాటు అమ్మవారు రోజుకో అలంకారంలో భక్తుల దర్శనం ఇవ్వనున్నారు. కరోనా రూల్స్ పాటిస్తూ భక్తులు అమ్మవారిని దర్శించుకునేలా అన్నీ ఏర్పాట్లు చేశారు. ప్రతి ఒక్కరూ మాస్క్ లు ధరించే రావాలని భక్తులకు సూచించారు.

## పేదరిక విషవలయంలో అభాగ్య భారతం..?

### (17 అక్టోబర్ "అంతర్జాతీయ పేదరిక నిర్మూలన దినం" సందర్భంగా)

మానవాళికి పేదరికం ఒక సమాజ బహువ్యాధి కారకంగా పట్టి పీడిస్తున్నది. పేదరికం ఒక ఆర్థిక సమస్య మాత్రమే కాదు, అది ఒక బహుముఖీన సమస్యలతో కూడిన విషవలయం. పేదరికంతో నిరక్షరాస్యత, మానవ హక్కుల ఉల్లంఘన, హింస, దోపిడీల, దొంగతనాలు, అసాంఘీక కార్యకలాపాలు, అమ్మ జీవన ప్రమాణాలు, అసురక్షిత గృహవసతులు, పోషకాహార లోపం, ఆరోగ్య అభద్రత, ఆకలిచావులు వంటివి ప్రత్యక్ష సంబంధాన్ని కలిగి ఉంటాయి. 1987లో జోసఫ్ వ్రెసిన్స్కీ చొరవతో ఫ్రాన్స్, పారిస్ నగరంలో పేదరికం, ఆకలి చావులు, హింస మరియు ప్రాణభయం బారినపడిన ప్రపంచ పౌరుల సమస్యలను చర్చించేందుకు ఒక లక్ష మందితో సమావేశం ఏర్పాటు చేయడం, 1992లో ఈ తీవ్ర సమస్యలకు స్పందించిన ఐక్యరాజ్యసమితి 17 అక్టోబర్ రోజున"అంతర్జాతీయ పేదరిక నిర్మూలణ దినం" పాటించాలని నిర్ణయం తీసుకున్నారు. పేదల దుస్థితిని సహానుభూతితో ఆకలింపు చేసుకొని, పేదరిక నిర్మూలనకు సదాలోచనలు చేయడానికి ఈ రోజును పాటించాలని సూచిస్తున్నారు. ఆర్థిక అసమానతలను తగ్గించడం, పేదల సుస్థిరాభివృద్ధికి కృషి చేయడం ప్రభుత్వాల కనీస భాద్యత అవుతుంది. ప్రపంచవ్యాప్తంగా 1990 విశ్వజనాభాలో 36 శాతం దారిద్ర్యరేఖ దిగువన ఉండగా, 2018 గణాంకాల ప్రకారం 8 శాతం మాత్రమే ఉన్నారని తేలింది. దక్షిణ ఆసియా మరియు సబ్-సహారా ఆఫ్రికావాసులు అధిక పేదరికం అనుభవిస్తున్నారని అంచనా. విశ్వవ్యాప్తంగా 55 శాతం జనాభాకు కనీసం ఒక సామాజిక రక్షణతో కూడిన ఆర్థిక సహాయానికి దూరంగా ఉన్నారని తేలింది. కోవిడ్-19 కల్లోలం ఫలితంగా గత దశాబ్దం తరువాత ప్రపంచవ్యాప్తంగా పేదరికం పెరిగినట్లు గమనించటం విచారకరం. విశ్వవ్యాప్తంగా కరోనా కారణంగా ఆదాయానికి కనీసం 20 శాతం కోత పడిందని, దీని వల్ల పేదల సంఖ్య 580 మిలియన్లు పెరిగే ప్రమాదం మరియు 265 మిలియన్లు తీవ్ర ఆకలి సమస్య ఉత్పన్నంఅవుతున్నదని తెలుస్తున్నది. కరోనా మహమ్మారి విజృంభనతో ఆహారపదార్థాల సరఫరాలో ఆటంకం కలిగిన కారణంగా ఆహార కొరత ఏర్పడి, నిరుద్యోగం పెరిగి, కొనుగోలు సామర్థ్యం తగ్గడం జరుగుతున్నది. విపత్తులు, కరువులు, మహమ్మారులు లాంటి ఏ ఉపద్రవం జరిగినా, పేదలే ముందు ప్రభావితం అవడం జరుగుతున్నది.

అంతర్జాతీయ పేదరిక దినం-2020 సందర్భంగా "అందరికి సామాజిక మరియు పర్యావరణ న్యాయాన్ని ఐక్యతతో అందిద్దాం" నినాదం తీసుకొని, పలు పేదరిక నిర్మూలన కార్యక్రమాలు నిర్వహిస్తున్నారు. ఐరాస ప్రణాళికల ప్రకారం 2030 నాటికి పేదరికం లేని ప్రపంచం అవతరించే దిశలో కార్యక్రమాలు రూపొందించాలని మార్గనిర్దేశనం చేస్తున్నారు. పేదల కష్టాలను అర్థం చేసుకోవడం, వారి గోడును సానుభూతితో ఆలకించడం మరియు పేదరిక నిర్మూలనకు సరైన కార్యాచరణ చేపట్టడం ప్రస్తుత కర్తవ్యంగా ప్రపంచ దేశాలు భావించాలి. పేద పిల్లలకు (బాలురు, బాలికలు) విద్య అందించడంతో భవిష్యత్తులో వారికి ఆర్థికాదాయం పెరగడం, పేదరికం తగ్గడం జరుగుతాయి. బాలల ఆర్థిక, పౌర, సామాజిక, రాజకీయ, సాంస్కృతిక హక్కులను కల్పించడానికి కృషి చేయాలి. ఆహార పదార్థాల ప్రజాపంపిణీ, వైద్య సదుపాయాల కల్పన, సురక్షిత నీరు, పరిసరాల పరిశుభ్రత, గర్భవతులకు పోషకాహారం అందించడం, ఉపాధి కల్పన లాంటి ప్రభుత్వ చర్యలు పేదరికాన్ని తగ్గించవచ్చు.

అధిక జనాభాగల భారత్‌లో 6.5 శాతం (73 మిలియన్లు) ప్రజలు దారిద్ర్యరేఖ దిగువన ఉన్నారని, గత దశాబ్దకాలంలో 271 మిలియన్లను పేదరికంలోంచి బయటకు తీసుకురావడం జరిగిందని నివేదికలు తెలుపుతున్నాయి. ఇండియాలోని ఒక శాతంగా ఉన్న ధనివంతులే 73 శాతం సంపదను అనుభవిస్తుండగా, 670 మిలియన్ల పేదల ఆదాయం ఒక శాతం మాత్రమే పెరిగిందని అంచనా వేశారు. మన దేశంలో అధిక జనాభా, వ్యవసాయ ఉత్పత్తుల తగ్గుదల, మౌళిక వసతుల లేమి, ఆర్థికవృద్ధి రేటు తగ్గడం, ధరల పెరుగుదల, నిరుద్యోగం, ఔత్సాహిక పారిశ్రామిక వేత్తలు తక్కువగా ఉండడం, సామాజిక కారణాలు, శ్రమదోపిడి, వాతావరణ కారకాలు లాంటి సమస్యలతో పేదరికం ప్రబలటం జరుగుతున్నది. భారత ప్రభుత్వం ఐఆర్‌డిపి, జవహర్ రోజ్‌గార్ యోజన, గ్రామీణ గృహవసతి, కరువు పనుల కల్పన, వృధాప్య పెన్షన్, అన్నపూర్ణ పథకం, గ్రామీణ ఉపాధి కల్పన, నేషనల్ అర్బన్ లైవ్‌లీహుడ్ మిషన్, ప్రధానమంత్రి కౌషల్ వికాస్ యోజన, ప్రధానమంత్రి జన్ ధన్ యోజన లాంటి పథకాలతో పేదరిక నిర్మూలన కార్యక్రమాలు అమలు చేస్తున్నారు. రాష్ట్రప్రభుత్వాలు ప్రజాపంపిణి ద్వారా ఆహారధాన్యాలు అందిస్తూ, పలు పథకాలతో పేదలకు చేయూతను ఇస్తున్నారు. భారతదేశ పేదరికం ఫలితంగా శిశుమరణాలు(సాలీనా 1.4 మిలియన్లు), పోషకాహారలోపం(61 మిలియన్లు), బాలకార్మిక దురాచారం(12.5 మిలియన్లు), బాలల అవిద్య (25 శాతం), బాల్యవివాహాలు(44.5 శాతం), హెచ్ఐవి- ఏయిడ్స్ (2.7 మిలియన్లు) లాంటి దుష్పరిణామాలు కలుగుతున్నాయి. పేదరిక నిర్మూలనలో ప్రభుత్వాలు, స్వచ్ఛంద సంస్థలు, పౌరసమాజం తమ చేయూతను అందిస్తూ, మానవ హక్కులకు పట్టం కట్టి, ఆకలి చావులు లేని సంతోషాలు నిండిన భారతాన్ని నిర్మించుకుందాం.



- డా॥ బుర్ర మధుసూదన్ రెడ్డి
99497 00037

## తెలంగాణకు మాత్రమే ప్రత్యేకం

### ప్రకృతి ఆరాధన ఇమిడి ఉన్న బతుకమ్మ

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): తెలంగాణకు మాత్రమే ప్రత్యేకమైన బతుకమ్మ పండగలో ప్రకృతి ఆరాధనతో పాటు కుటుంబ కట్టుబాటు, ఆచారాలు ఇమిడి ఉన్నాయి. సంఘంలో క్రమశిక్షణకు, వ్యక్తుల ఆధ్యాత్మిక సరళికి ఇవి దోహదం చేస్తున్నాయి. ఈ పరంపర లోకే ఆశ్వయుజ మాసంలో నిర్వహించే శరన్నవరాత్రులు కూడా వస్తాయి. ఆటపాటల నేపథ్యంగా, నిత్య జీవన రీతికి అనుగుణంగా ఈ సంబరాల్ని కొనసాగిస్తారు. ప్రాణశక్తి, ప్రాణధాత్రి, ప్రాణెశ్వరి అనే ఆదిశక్తి నామాలకు ప్రతిబింబం. బతుకమ్మ అంటే బతుకునివ్వడంతో పాటు, సకల ప్రాణులకూ జీవశక్తిని అందజేసే ప్రకృతి, ఆకృతి- బతుకమ్మ. తొమ్మిది రోజులపాటు బతుకమ్మ సందడి విలసిల్లుతుంది. రంగురంగుల పుష్ప సౌందర్యాల హంగులతో సింగారించుకొనే బంగరు కల్పవల్లిగా బతుకమ్మను తెలంగాణవాసులు భావిస్తారు. ఓ పళ్లెంలో గుమ్మడి ఆకులు పరచి, వాటిని పసుపు కుంకుమలతో అలంకరిస్తారు. ముందుగా గుమ్మడి పువ్వుల్ని అమర్చి- అక్కడే తంగేడు, బీర, గన్నేరు, నిత్య మల్లె, బంతి వంటి పుష్పాల్నిపేర్చి కూర్చడం కళాత్మకంగా చేస్తారు. అదే పువ్వుల దొంతరపై తమలపాకులో పసుపు గౌరమ్మను అలంకరిస్తారు. ఆ పుష్ప సముదాయాన్నే బతుకమ్మగా వ్యవహరిస్తారు. మహిళలు లయాత్మకంగా అడుగులు వేస్తూ, చుట్టూ ప్రదక్షిణ చేస్తారు. బతుకమ్మ ఆవిర్భావం, గౌరీదేవి లీలలు, సామాజిక జీవన రీతులు, కుటుంబాల అనుబంధాలు, పురాణగాథలు, ఇతిహాస ఘట్టాల్ని వారు పాటల రూపంలో ఆలపిస్తారు.

పసుపుబొట్టు పేరిట తాంబూలాలు ఇచ్చి పుచ్చుకొంటారు. బతుకమ్మను పసుపు, కుంకుమలతో ఆరాధించి వివిధ రకాల పదార్థాల్ని నివేదన చేస్తారు. ఆటపాటల అనంతరం, ప్రతి నిత్యం జలాశయాల్లో నిమజ్జనం చేయడం ఈ సంప్రదాయంలో ఒక భాగం. ప్రకృతి స్వరూపిణిగా అమ్మవారిని భావించి, వివిధ పుష్పాలతో పేర్చి 'బతుకమ్మ'గా ఆరాధిస్తారు. బతుకమ్మగా పిలిచే గౌరమ్మ అయినా, దేవీరూపాలలోని పదుగురు అమ్మలయిన లలితాదేవి, అన్నపూర్ణ, రాజరాజేశ్వరి, పార్వతి, మహాలక్ష్మి, గాయత్రి, సరస్వతి, దుర్గ, మహిషాసురమర్దని, అపరాజితాదేవి అందరూ పరాశక్తికి చెందిన ప్రధాన, ఉపప్రధాన, అంశాత్మక స్వరూపాలేనని మన పురాణాలు చెబుతు న్నాయి. భూమిమీది మట్టి, చెట్టు, నీరు, నిప్పులలోనే కాదు, గ్రామగ్రామాన వెలసిన ఎల్లమ్మ, బాలమ్మ, పోలేరమ్మ, పెద్దమ్మలు.. వంటి అమ్మలంతా ఆమెకు ప్రతీకలు, ప్రతిరూపాలే. ఇంతేనా, సమస్త సృష్టికే ఆమెనే మూలం. మహాలయ అమావాస్య నుంచి మహర్నవమి వరకు సాగే ఈ ఉత్సవం తెలంగాణ సాంస్కృతిక సౌరభాల్ని వెదజల్లుతుంది.

అందుకే మన జీవన విధానం, సామాజిక ఏకత్వానికి మన పండుగలు ప్రతీకలుగా నిలుస్తున్నాయి. జాతి చరిత్రకు, సంస్కృతికి, సంప్రదాయ వైభవానికి ఈ ఉత్సవాలు ఉపకరిస్తున్నాయి. పూర్ణత్వానికి సంకేతం- తొమ్మిది. నవ విధ భక్తి మార్గాలకు, నవ నిధులకు ప్రతిబింబంగా బతుకమ్మను తొమ్మిది రకాల పుష్పాలతో తొమ్మిది వరసల్లో అమరుస్తారు. ఈ తొమ్మిది రోజుల్లో- మొదటి, రెండో రోజుల్లో బొడ్డెమ్మగా, మూడో రోజు లక్ష్మీదేవిగా, నాలుగో రోజు గౌరమ్మగా ఆరాధిస్తారు. అయిదో రోజు అట్ల బతుకమ్మగా, ఆరో రోజు అలిగిన బతుకమ్మగా, ఏడో రోజు చకినాల బతుకమ్మగా, ఎనిమిదో రోజు దుర్గమ్మగా, తొమ్మిదో రోజు సద్దుల బతుకమ్మగా ఆరాధించడం సంప్రదాయం. తొమ్మిది రోజులూ గౌరీదేవి 'పూలమ్మ'గా పుట్టింటికి తరలి వచ్చినట్లు భావిస్తారు. తమ ఇంటి ఆడబిడ్డగా బతుకమ్మను భావిస్తూ, ఆరాధన చేస్తారు. తొమ్మిదో రోజున సద్దుల బతుకమ్మకు సాగనంపు వేడుక నిర్వహిస్తారు. గౌరమ్మను అత్తవారింటికి- అంటే, శివుడి వద్దకు పంపుతూ, నకల సౌభాగ్యాలూ అనుగ్రహించడానికి మళ్లీ తరలిరమ్మని వేడుకుంటారు. ప్రకృతి నుంచి ఆవిష్కృతమైన పూల పుంత బతుకమ్మ. జలాల్లో సమ్మిళితమై, చివరికి ఆ ప్రకృతిలోనే మమేకమవుతుంది. పూలతో బతుకమ్మ ఆవిర్భవించడం, ఆటపాటలతో అలరింతగా వేడుక చేయడం, నిమజ్జనంతో అనంత ప్రకృతిలో సంలీనం కావడం అనేవి- జగన్మాత సృష్టి, స్థితి, లయాత్మక తత్వాలకు సంకేతాలుగా భావించాలి. నవరాత్రుల్లో చేసే చక్రార్చనకు మరో రూపమే బతుకమ్మ ఆరాధన. ఇచ్ఛాశక్తి, క్రియాశక్తి, జ్ఞానశక్తుల సమ్మేళన రూపం ఆమె. 'ప్రకృతిని పూజించండి, పరిరక్షించండి. ఆ ప్రకృతే మిమ్మల్ని రక్షిస్తుంది' అనే సామాజిక ఆత్మీయ సందేశాన్ని బతుకమ్మ అందిస్తుంది.

## యాసంగి పంటల విధానం ఖరారు

### 50 లక్షల ఎకరాల్లో వరిపంటకు ఆమోదం

### 15 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు

### -ప్రగతి భవన్‌లో సమీక్షించిన సిఎం కెసిఆర్

హైదరాబాద్,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): యాసంగి పంటల విధానాన్ని ప్రభుత్వం ఖరారు చేసింది. యాసంగిలో అమలు చేయాల్సిన నిర్ణీత పంటల సాగు విధానంపై ముఖ్యమంత్రి కేసీఆర్ గురువారం ప్రగతి భవన్‌లో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా 2020-21 యాసంగి సీజన్‌లో 50 లక్షల ఎకరాల్లో వరిపంట, మరో 15 లక్షల ఎకరాల్లో ఇతర పంటలు సాగు చేయాలని సీఎం రైతులకు సూచించారు. జిల్లాల వారీగా, మండలాల వారీగా, క్లస్టర్ల వారీగా ఏ పంటలు వేయాలనే విషయంలో వ్యవసాయ అధికారులు స్థానికంగా రైతులకు సూచించాలని ఆదేశించారు. ప్రస్తుత వానాకాలం సీజన్‌లో ప్రభుత్వం సూచించిన మేరకు వందకు వంద శాతం నిర్ణీత పద్ధతిలోనే రైతులు పంటలు సాగు చేశారని, ఇదే ఒరవడిని యాసంగిలోనూ కొనసాగించాలని సీఎం రైతులకు పిలుపునిచ్చారు. వరి పంటను 50 లక్షల ఎకరాల్లో, శనగ 4.5 లక్షల ఎకరాల్లో, వేరుశనగ 4 లక్షల ఎకరాల్లో, మిరపతో పాటు ఇతర కూరగాయలు లక్షన్నర నుంచి రెండు లక్షల ఎకరాల్లో, జొన్న లక్ష ఎకరాల్లో, నువ్వులు లక్ష ఎకరాల్లో, పెసర్లు 50 నుంచి 60 వేల ఎకరాల్లో, మినుములు 50 వేల ఎకరాల్లో, పొద్దు తిరుగుడు 30-40 వేల ఎకరాల్లో, ఆవాలు-కుసుమలు-సజ్జలు లాంటి పంటలు మరో 60 నుంచి 70 వేల ఎకరాల్లో సాగు చేయాలని ప్రభుత్వం నిర్ణయించింది. ఈ పంటలకు సంబంధించిన విత్తనాలు, ఎరువులు సిద్ధంగా ఉంచినట్లు సీఎం వెల్లడించారు. వ్యవసాధికారులు సూచించిన మేరకు రైతులు పంటలు సాగు చేయాలని తద్వారా మంచి ధర పొందాలని సీఎం పేర్కొన్నారు. ఈ సమీక్షలో వ్యవసాయ శాఖ మంత్రి సింగిరెడ్డి నిరంజన్ రెడ్డి, రైతుబంధు సమితి అధ్యక్షులు పల్లా రాజేశ్వర్ రెడ్డి, ప్రభుత్వ ముఖ్య సలహాదారు రాజీవ్ శర్మ, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి సోమేశ్ కుమార్, వ్యవసాయశాఖ కార్యదర్శి జనార్ధన్ రెడ్డి, సీఎంవో అధికారులు స్మితా సబర్వాల్, ప్రియాంక వర్గీస్, అగ్రికల్చర్ యూనివర్సిటీ వీసి ప్రవీణ్ రావు, ఉద్యానవనశాఖ ఎండి వెంకట్రామ్ రెడ్డి, జేడీ శోభారాణి తదితరులు పాల్గొన్నారు.

## ఉమ్మడి జిల్లాలో 19నుంచి పత్తి కొనుగోళ్లు

### 1.16 కోట్ల క్వింటాళ్ల పత్తి దిగుబడి అంచనా

### కొనుగోళ్లకు ఏర్పాట్లు చేసిన సిసిఐ

ఆదిలాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా ఈ నెల 19నుంచి పత్తి కొనుగోళ్లు ప్రారంభంకానున్నాయి. 8 నుంచి 12 శాతం తేమ ఉన్న పత్తిని కొనుగోలు చేస్తామని సీసీఐ అధికారులు వెల్లడించారు. జిల్లా వ్యాప్తంగా దాదాపు 1.16 కోట్ల క్వింటాళ్ల పత్తి దిగుబడి వస్తుందని అధికారులు అంచనా వేస్తున్నారు. జిల్లాలో ఈ యేడాది నియంత్రిత సాగు విధానంలో రైతులు అత్యధికంగా పత్తి సాగు చేయగా, ఎలాంటి ఇబ్బందుల్లేకుండా పంట కొనుగోళ్లు చేపట్టాలని అధికారులు, ప్రజాప్రతినిధులు నిర్ణయించారు. ఈ మేరకు మంత్రి అల్లోల ఇంద్రకరణ్‌రెడ్డి మార్కెట్ కమిటీ చైర్మన్లు, వ్యవసాయ, మార్కెటింగ్ అధికారులు, రైతు సంఘాల నాయకులకు తగు సూచనలు చేశారు. ఈ ఏడాది రైతులు వానకాలంలో నియంత్రిత సాగు విధానంలో 4.21 లక్షల ఎకరాల్లో పత్తి వేశారు. ఎకరానికి 8 నుంచి 10 క్వింటాళ్ల వరకు పత్తి రైతు చేతికి రానున్నది. ఇప్పటికే జిల్లావ్యాప్తంగా పలు ప్రాంతాల్లో రైతులు పత్తి ఏరుతున్నారు. జిల్లాలోని పది మార్కెట్ యార్డుల్లో సీసీఐ ఆధ్వర్యంలో కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తారు. ప్రభుత్వం ప్రకటించిన మద్దతు ధర క్వింటాల్‌కు రూ.5,825 చొప్పును సీసీఐ అధికారులు పత్తిని తీసుకుంటారు. పంట కొనుగోలు చేసిన 48 నుంచి 72 గంటల వ్యవధిలో రైతుల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ చేయనున్నారు. పంట కొనుగోళ్లకు సంబంధించి అన్ని మార్కెట్‌యార్డుల్లో కాంటాలను సిద్ధం చేసి, సిబ్బందిని అందుబాటులో ఉంచుతారు. కొవిడ్-19 నిబంధనలు పాటిస్తూ పత్తిని సేకరించనున్నారు. సీసీఐ అధికారులు మొత్తం పంటను కొనుగోలు చేయడానికి సిద్ధంగా ఉన్నారని తెలిపారు. అన్ని మార్కెట్ యార్డుల్లో మద్దతు ధరతో పత్తి కొనుగోలు చేసేలా చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. పంట కొనుగోళ్లకు మార్కెట్‌యార్డులను సిద్ధం చేసినట్లు చెప్పారు. పంట కొనుగోళ్లు చేసేటప్పుడు కరోనా నిబంధనలు పాటించేలా చూడాలని చెప్పారు. పత్తి కొనుగోళ్లలో ఎలాంటి ఇబ్బందుల్లేకుండా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ సిక్తా పట్నాయక్ తెలిపారు. ఇందుకోసం ఇప్పటికే వివిధ శాఖల అధికారులతో సమావేశాలు నిర్వహించామన్నారు. ఈ సారి జిల్లాలో 47.37 లక్షల క్వింటాళ్ల పంట దిగుబడి వచ్చే అవకాశాలున్నాయని, పూర్తిస్థాయిలో పంటను కొనుగోలు చేసి మద్దతు ధర లభించేలా చర్యలు చేపట్టామన్నారు. జిల్లాలో పది మార్కెట్‌యార్డుల్లో సీసీఐ కేంద్రాలు ఏర్పాటు చేస్తామని, ప్రతిచోటా కొవిడ్-19 నిబంధనలు పాటిస్తామన్నారు. ఏజెన్సీ ప్రాంతాల్లో పట్టాలు లేని గిరిజనేతర రైతులు పత్తి పంటను సాగు చేస్తున్నారని, వారి నుంచి సీసీఐ అధికారులు పత్తి కొనుగోలు చేయాలని కోరారు. ఈ విషయంలో రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు ధ్రువీకరణ పత్రాలు జారీ చేసేలా చూడాలన్నారు.

## పర్యాటకంగా కొత్త చెరువు అభివృద్ధి: మంత్రి

మహబూబ్‌నగర్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): మహబూబ్ నగర్ మున్సిపాలిటీ పరిధిలోని కొత్త చెరువును పర్యాటక పరంగా అభివృద్ధి చేస్తామని మంత్రి ఎక్సైజ్ శాఖ మంత్రి వి.శ్రీనివాస్ గౌడ్ అన్నారు. గురువారం కొత్త చెరువులో చేప పిల్లలను వదిలారు. ఈ సందర్భంగా మంత్రి మాట్లాడుతూ..మిషన్ కాకతీయ పథకం కారణంగానే 30 ఏండ్ల తర్వాత చెరువు అలుగు పారుతున్న దృశ్యం చూసే అవకాశం లభించిందన్నారు. త్వరలో చెరువులో షికారు చేసేందుకు వీలుగా బోట్ సౌకర్యం కల్పిస్తామని తెలిపారు. అనంతరం మంత్రి చిన్నారులతో కలిసి సందడి చేశారు. చెరువు అలుగు పారుతున్న సుందర దృశ్యాన్ని చూసేందుకు అనేక మంది పట్టణ వాసులు తరలివచ్చారు. మంత్రిని చూసిన చిన్నారులు తమతో ఫొటో దిగాలని కోరగా, వెంటనే అలుగు వద్దకు వెళ్లి వాళ్లతో ఫొటోలు దిగారు. కార్యక్రమంలో ఎంపీ మన్నే శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## రాజకీయాలు పక్కన పెట్టి సాయంలోకి రండి

### -నేతలకు మంత్రి కిషన్ రెడ్డి పిలుపు

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): రాజకీయాలు కాదు.. ప్రజలు సాయం కోరుకుంటున్నారని కేంద్రమంత్రి కిషన్‌రెడ్డి తెలిపారు. మూడు, నాలుగు రోజులు అన్ని పార్టీలు రాజకీయాలను పక్కన పెట్టాలని సూచించారు. నగరంలో పలుప్రాంతాల్లో పర్యటించిన అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

నష్టంపై ప్రభుత్వం నివేదికలు ఇవ్వకుండా.. కేంద్రం సాయం చేయడం లేదనడాన్ని ఖండిస్తున్నామని చెప్పారు. కష్టకాలంలో రెండు రాష్ట్రాలకు కేంద్రం అండగా ఉంటోందని కిషన్‌రెడ్డి భరోసా ఇచ్చారు. ప్రభుత్వ నిర్లక్ష్యమే హైదరాబాద్ ప్రస్తుత పరిస్థితికి కారణమని, టెక్నాలజీని ఉపయోగించటంలో జీహెచ్ఎంసీ విఫలమైందని కిషన్‌రెడ్డి తప్పుబట్టారు. ఏప్రిల్, మే నెలలో ఓపెన్ నాలాలు, డ్రైనేజీల్లో.. సిల్ట్ తీసే సంప్రదాయాన్ని ప్రభుత్వం విస్మరించిందని ఆరోపించారు. తెలుగు రాష్ట్రాలకు అండగా ఉంటామని ప్రధాని మోదీ హామీ ఇచ్చారని కిషన్‌రెడ్డి గుర్తుచేశారు.

## హెచ్ఆర్‌డిలో బతుకమ్మ సరోవర్

### -ప్రారంభించిన బిపి ఆచార్య

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): తెలంగాణలో బతుకమ్మ సంబురాలు ఎంతో ఘనంగా నిర్వహిస్తారు. మహిళలు ఎంతో భక్తి శ్రద్ధలతో జరుపుకునే బతుకమ్మలను చెరువులు, బావుల్లో నిబజ్జనం చేస్తారు. నగరంలోని మర్రి చెన్నారెడ్డి మానవ వనరుల అభివృద్ధి సంస్థ (ఎంసిహెచ్ఆర్‌డి), సాఫ్ట్‌వేర్ టెక్నాలజీ పార్కును ఆనుకుని ఉన్న వాటర్‌బాడీని ' బతుకమ్మ సరోవర్' గా తీర్చిదిద్దారు. ఈ సరోవర్‌ను గురువారం ఎంసిహెచ్ఆర్‌డి డైరెక్టర్ జనరల్ బిపి ఆచార్య ప్రారంభించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ పర్యావరణానికి అనుకూలమైన కార్యక్రమాలుచేపట్టినందుకు జిఆర్‌రెడ్డి ఇన్‌స్టిట్యూట్‌ని అభినందించారు. పునరుద్దరించబడిన బతుకమ్మ సరోవర్ క్యాంపస్‌లో జీవ వైవిధ్యానికి మరింత తోడ్పడుతుందని అన్నారు. ట్యాంక్ చుట్టూ ఉన్న గ్రీన్ బెల్ట్ ఇన్‌స్టిట్యూట్ సహజ సౌందర్యాన్ని మరింత సుసంపన్నం చేసిందని ఆయన పేర్కొన్నారు. ఇంతకు ముందు ఈ టాంక్ దోమలతో నిండి ఉండేది. హెచ్ఎండిఏ ద్వారా స్వచ్ఛ బాటర్‌బాడీగా 28 లక్షలతో పునరుద్దరించినట్టుచెప్పారు. ఈ టాంక్ నిల్వసామర్థ్యాన్ని రెండు లక్షల లీటర్ల నుంచి 26 లక్షల లీటర్లకు అంటే లక్ష క్యూబిక్ అడుగులకు పెంచినట్టు తెలిపారు. ట్యాంక్ మధ్యలో ఒక ఫౌంటేన్ ఏర్పాటుచేశామన్నారు. అది నీటిని 30అడుగుల ఎత్తు , 20అడుగుల వ్యాసం వరకు వెదజల్లుతూ రంగు రంగుల లైటింగ్‌తో సహజ సౌదర్యంతో కనువిందుచేస్తుందన్నారు.

# జూరాలకు పోటెత్తిన వరద

## గేట్లు ఎత్తి దిగువకు నీటి విడుదల

మహబూబ్‌నగర్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): ఉమ్మడి మహబూనగర్ జిల్లాలోని జూరాల ప్రాజెక్టుకు భారీ వరద పోటెత్తుతున్నది. ప్రాజెక్టు ఇప్పటికే పూర్తిస్థాయిలో నిండటంతో వచ్చిన నీటిని వచ్చినట్లు దిగువకు విడుదల చేస్తున్నారు. ఎగువన విస్తారంగా వర్షాలు కురియడంతో ప్రాజెక్టులోకి 5.47 లక్షల క్యూసెక్కుల నీరు వచ్చిచేరుతున్నది. దీంతో 48 గేట్లు ఎత్తి 6.30 లక్షల క్యూసెక్కుల నీటిని వదులుతున్నారు. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటిమట్టం 1045 అడుగులు కాగా, ప్రస్తుతం 1,401 అడుగుల నీటిమట్టం ఉన్నది. జలాశయంలో ప్రస్తుతం 5.699 టీఎంసీల నీరు నిల్వ ఉన్నది. ప్రాజెక్టు పూర్తిస్థాయి నీటినిల్వ సామర్థ్యం 9.657 టీఎంసీలు. ప్రాజెక్టులోకి భారీగా వరద వచ్చిచేరుతుండటంతో జూరాల పరీవాహక ప్రాంతాల్లోని ప్రజలను అధికారులు అప్రమత్తం చేశారు. భారీ వర్షాల కారణంగా సింగూర్ ప్రాజెక్ట్‌కు వరద ప్రవాహం కొనసాగుతోంది. సింగూర్ ప్రాజెక్టు పూర్తి నీటి నిల్వ సామర్థ్యం 29.917 టీఎంసీలు కాగా... ప్రస్తుతం నీటి నిల్వ మట్టం 28.776 టీఎంసీలకు చేరుకుంది. ప్రాజెక్టులోకి వరద నీటి ఇన్ ఎ÷-లో 42036 క్యూసెక్కులు చేరుతోంది. అలాగే ప్రాజెక్టు నుండి నీటి ఔట్ ఎ÷-లో 42036 క్యూసెక్కులుగా ఉంది. సింగూర్ ప్రాజెక్టు ఎఫ్ఆర్ఎల్ 523.600 మీటర్లకు గాను.. ప్రస్తుతం 522.570 మీటర్లుగా నమోదు అయ్యింది.

# ఉమ్మడి జిల్లాలో ప్రాజెక్టులకు జలకళ

## భారీగా దెబ్బతిన్న వ్యవసాయ పంటలు

## నష్టం అంచనా వేసి నివేదికలు సిద్ధం చేస్తున్న అధికారులు

ఖమ్మం,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): అల్పపీడన ప్రభావంతో రెండు రోజులుగా కురిసిన వర్షం కారణంగా ఉమ్మడి ఖమ్మం జిల్లా అతలాకుతలమైంది. పలు ప్రాంతాలు జలమయమయ్యాయి. దీంతో జనజీవనం స్తంభించిపోయింది. విస్తారంగా వర్షం కురవడంతో వరి, పత్తి పంటలు దెబ్బతిన్నాయి. జిల్లాలో చిన్న, చిన్న కుంటలు, చెరువులు మొదలుకొని మధ్యతరహా, రిజర్వాయర్ల వరకు నిండుకుండలను తలపిస్తున్నాయి. ఈ ఏడాది వానాకాలం సీజన్ ఆరంభం నుంచి వరుసగా కురుస్తున్న వర్షాలకు ఎప్పటి కప్పుడు వరదనీరు వచ్చి చేరుతున్నది. తాజాగా అధిక వర్షపాతం నమోదు కావడంతో మరోమారు జలాశయాలకు జలకళ సంతరించుకున్నది. చెరువులు, కుంటలు పూర్తిస్థాయిలో నిండిపోయాయి. జిల్లా కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్ సంబంధిత అధికారులతో కలిసి జిల్లా వ్యాప్తంగా ఆయా మండలాల్లో పర్యటించారు. ఆయా మండలాల పరిధిలో దెబ్బతిన్న రహదారులు, పంట నష్టం తదితర అంశాలపై ఆయన ప్రత్యేక దృష్టి సారించారు. కలెక్టర్‌తోపాటు జిల్లా వ్యవసాయశాఖ అధికారి, ఉద్యానపట్టు పరిశ్రమశాఖ అధికారి, ఇరిగేషన్ అధికారులు సైతం క్షేత్రస్థాయిలో పర్యటించి భారీ వర్షానికి కలిగిన నష్టాలపై ఆరా తీశారు. వైరా కృషివిజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలు సైతం అధికారులతో కలిసి పంట పొలాలను సందర్శించారు. పత్తి, వరి, మిర్చి, ఇతర ఉద్యానపంటలు సా గు చేసిన రైతులతో మాట్లాడారు. పంటను సాధారణ స్థితికి తీసుకువచ్చేందుకు తీసుకోవాల్సిన చర్యలపై అవగాహన కల్పించారు. ఎక్కువ మొత్తంలో నష్టం జరిగిన పంట వివరాలను ఆయా వ్యవసాయశాఖ విస్తరణ అధికారులు సేకరించి జిల్లా వ్యవసాయశాఖ కార్యాలయానికి తరలించారు.

ఖమ్మం జిల్లాలో కలెక్టర్ ఆర్‌వీ కర్ణన్, భద్రాద్రి జిల్లాలో కలెక్టర్ ఎంవీ రెడ్డి దెబ్బతిన్న రహదారులు, పంట పొలాలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల రైతులకు భరోసా ఇచ్చారు. గ్రామ వ్యవసాయ శాఖ, ఉద్యానశాఖ విస్తరణ అధికారుల నుంచి మొదలుకొని జిల్లా అధికారుల వరకు పంట పొలాలను పరిశీలించారు. శాస్త్రవేత్తలు రైతులకు సలహాలు సూచనలు చేశారు. ప్రమాదకరంగా మారిన చెరువులు, కుంటలు, మధ్యతరహా జలాశయాలను సైతం ఇరిగేషన్ అధికారులు పరిశీలించారు. తెగిన కట్టలు, కాల్వల పునరుద్ధరణకు అవసరమైన చర్యలు చేపట్టారు. అయితే పొలాల్లో నీరు నిల్వ ఉండటంతో జాగ్రత్తలపై ఆయా గ్రామ స్థాయి అధికారులకు జిల్లా అధికారులు దిశా నిర్దేశం చేశారు. ఖమ్మం జిల్లాలో 75, 364 ఎకరాల్లో పంట నష్టం జరిగినట్లు వ్యవసాయశాఖ అధికారుల ప్రాథమిక పరిశీలనలో వెల్లడైంది. మూడు రోజుల తరువాత పంట పొలాలను పునపరిశీలించి మరోమారు నివేదిక తయారు చేసే అవకాశ ముంది. వరి 38,111 ఎకరాలు, పత్తి 37,227 ఎకరాలు, కంది 26ఎకరాల్లో ప్రభుత్వ నిబంధనలమేరకు 33 శాతం కంటే అధికంగా నష్టం వాటిల్లినట్లు తేల్చారు. ఉద్యాన పంటలైన మిర్చి, కూరగాయలు, పండ్లు, పూల తోటలకు సంబంధించి ఒకటి రెండు రోజుల్లో పూర్తి వివరాలు అధికారులు సేకరించనున్నారు. భద్రాద్రి జిల్లాలో 8,313ఎకరాల్లో పంటలు నీట మునిగాయి. జిల్లా వ్యాప్తంగా 8,313ఎకరాల్లో పంట నీట మునిగింది. 7,212 ఎకరాల్లో వరి, 686ఎకరాల్లో పత్తి, 155ఎకరాల్లో వేరుశనగ, 260ఎకరాల్లో మిర్చి పంట నీటమునిగింది. మొత్తం 67గ్రామాల్లో భారీ వర్షం నమోదుకాగా, 4,198 మంది రైతులు తీవ్రంగా నష్టపోయారు. పలుచోట్ల విద్యుత్ సరఫరాకు అంతరాయం ఏర్పడింది. రోడ్లపై చెట్లు విరిగిపడటంతో వాహనాల రాకపోకలు స్తంభించాయి. అధికారులు ప్రత్యామ్నాయ చర్యలు చేపట్టి విద్యుత్ పునరుద్ధరణ, రోడ్లకు మరమ్మతులు చేపట్టారు. వర్షాలతో జిల్లా వ్యాప్తంగా ఉన్న చెరువులు, వాగులు, వంకలు, ప్రాజెక్టులు నిండుకుండను తలపిస్తున్నాయి. పలు మండలాల్లో పంట నీటమునగడంతో రైతులు ఇబ్బందులు పడుతున్నారు. కలెక్టర్ డాక్టర్ ఎంవీ రెడ్డి ఆదేశాలతో మండలాల వారీగా రెవెన్యూ, వ్యవసాయశాఖ అధికారులు రంగంలోకి దిగి నీటమునిగిన పంటను లెక్కిస్తున్నారు. త్వరితగతిన పంట నష్టాన్ని అంచనా వేసి నివేదిక అందజేయాలని కలెక్టర్ ఆదేశించారు.

# దసరా ఉత్సవాలకు సిద్ధమైన శ్రీశైలం

## -నేటి నుంచి శరన్నవరాత్రి ఉత్సవాలు

కర్నూలు:,అక్టోబర్16(ఆర్ఎన్ఎ):శ్రీశైలం శ్రీ భ్రమరాంబమల్లికార్జునస్వామి దేవాలయంలో శనివారం 17వ తేదీ నుంచి దసర మహోత్సవాలు మొదలుకానున్నాయి. ఉదయం 8:30 గంటలకు యాగశాల ప్రవేశంతో దసర నవరాత్రి ఉత్సవాలు ప్రారంభంకానున్నాయి. 17 నుంచి 25 వరకు ఆలయంలో ఆర్జిత, హోమాలు తాత్కాలికంగా నిలిపివేసినట్లు ఈవో కెఎస్ రామారావు తెలిపారు. దసరా నవరాత్రులలో స్వామి అమ్మవార్ల గ్రామోత్సవం రద్దు చేసినట్లు చెప్పారు. కోవిడ్ నిబంధనల కారణంగా ఆలయ ప్రాంగణంలో ఉత్సవాలు నిర్వహింపబడుతుందని తెలిపారు. శ్రీశైలం ఆలయంలో స్వామి అమ్మవార్లు తొమ్మిది రోజుల పాటు తొమ్మిది అలంకారాలలో రోజుకొక్క అలంకారంలో భక్తులకు దర్శనం ఇవ్వనున్నట్లు ఈవో వెల్లడించారు. అలాగే మహానందిలో ఈనెల 17 నుంచి 25వ తేదీ వరకు దసరా శరన్నవరాత్రి ఉత్సవాలు నిర్వహిస్తున్నట్లు దేవస్థానం ఈవో గంజి మల్లికార్జునప్రసాద్ తెలిపారు. మహానందిలోని కళ్యాణమంటపంలో దసరా శరన్నవరాత్రి ఉత్సవాల ఆహ్వానపత్రికలను ఆవిష్కరించారు. ఈనెల 17న శైలపుత్రిదుర్గ, 18న బ్రహ్మచారిణి, 19న చంద్రఘంట, 20న కూష్మాండ, 21న స్కందమాత, 22న కాత్యాయిని, 23న కాళరాత్రి, 24న మహాగౌరి, 25న సిద్ధిదాత్రి అలంకారాలతో కామేశ్వరిదేవి భక్తులకు దర్శనం ఇస్తుందన్నారు. 25న విజయదశమి రోజు పూర్ణాహుతి, కలశ ప్రదక్షిణతో పాటు సాయంత్రం మహానంది సమీపంలోని జమ్మిచెట్టుకు శమీ పూజ నిర్వహించడంతో ఉత్సవాలు ముగుస్తాయన్నారు. కార్యక్రమంలో ఆలయ అధికారులతో పాటు, దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సహస్ర దీపాలంకరణ సేవ దాత నంద్యాల టి. రామన్న అండ్ సన్స్ హోల్‌సేల్ కూరగాయల వ్యాపారి లక్కబోయిన వెంకటవరప్రసాద్ పాల్గొన్నారు.

# భారత్-తుర్క్‌మెనిస్థాన్ మధ్య సంబంధాల బలోపేతం

## -ఇరుదేశాల అధ్యక్షుల మధ్య టెలిఫోన్ సంభాషణ

న్యూఢిల్లీ,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): భారత్-తుర్క్‌మెనిస్థాన్ మధ్య ద్వైపాక్షిక సంబంధాల బలోపేతానికి వ్యక్తిగతంగా శ్రద్ధ తీసుకుంటున్న తుర్క్‌మెనిస్థాన్ అధ్యక్షుడు గుర్‌బంగులీ బెర్దిముహమెదోవ్‌కు రాష్ట్రపతి రామ్‌నాథ్ కోవింద్ ధన్యవాదాలు తెలిపారు. రామ్‌నాథ్ కోవింద్, గుర్‌బంగులీ బెర్దిముహమెదోవ్ గురువారం టెలిఫోన్ ద్వారా సంభాషించారు. రాష్ట్రపతి భవన్ గురువారం విడుదల చేసిన ప్రకటనలో తెలిపిన వివరాల ప్రకారం, చారిత్రక, నాగరిక పునాదులపై ఇరు దేశాల మధ్య సత్సంబంధాలు కొనసాగుతున్నట్లు ఇరువురు పేర్కొన్నారు. ఉభయ దేశాల మధ్య సుహృద్భావ సంబంధాలు ఉన్నాయన్నారు. వివిధ రంగాల్లో ఇరు దేశాల మధ్య సుస్థిరమైన సహకారం కొనసాగుతోందన్నారు. ముఖ్యంగా ఫార్మాస్యూటికల్ రంగంలో పటిష్ఠ సంబంధాలు ఉన్నట్లు తెలిపారు. వాణిజ్యం, ఆర్థిక రంగాల్లో విస్తృత అవకాశాలు ఉన్నాయన్నారు. భారత్-తుర్క్‌మెన్ కంపెనీల మధ్య ఉమ్మడి సహకారం విజయవంతమైందని పేర్కొన్నారు.

# బాసరలో ఘనంగా శరన్నవరాత్రి

## పరిమిత సంఖ్యల మాత్రమే భక్తులకు అనుమతి

నిర్మల్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): బాసర శ్రీ జ్ఞాన సరస్వతీ అమ్మవారి ఆలయంలో శారదీయ శరన్నవరాత్రి ఉత్సవాలు అంగరంగ వైభవంగా కొనసాగుతాయి. తొలిరోజు అమ్మవారు శైలపుత్రిగా దర్శనమిస్తారు. చదువులతల్లి సరస్వతి దేవీ ఆలయంలో శరన్నవరాత్రి ఉత్సవాలు ప్రారంభం సందర్భంగా అక్షరాభ్యాసాలు కూడా జోరుగా సాగుతాయి. అయితే కరోనా కారణంగా పరిమిత సంఖ్యలో భక్తులను అనుమతించ నున్నారు. సామాజిక దూరంతో పాటు, మాస్కులు దరించి రావడం తప్పనిసరని అధికారుల తెలిపారు. ఉత్సవాల సందర్భంగా ఏటా బాసర ఆలయానికి భక్తజనం పోటెత్తుత్తారు. తెల్లవారుజాము నుంచే గోదావరిలో భక్తులు పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారి దర్శనానికి బారులు తీరడం ఆనవాయితీ. . చిన్నారులకు పెద్దఎత్తున అక్షరాభ్యాసాలు చేయిస్తుంటారు. ఉదయం 5 గంటల నుంచి చిన్నారులకు అక్షరాభ్యాసాలు ప్రారంభమవుతాయి. వేకువజాము నుంచే అమ్మవారి వేదపారాయణం నిర్వహణ చేపట్టారు. ఉదయం 9 గంటలకు అమ్మవారి మహా చండీయాగం. మధ్యాహ్నం 12 గంటలకు మహా నివేదన చేపడతారు. రాష్ట్రం నుంచే కాకుండా మహారాష్ట్ర, కర్ణాటక, తమిళనాడు, ఆంధ్రప్రదేశ్ తదితర ప్రాంతాల నుంచి భక్తులు పెద్ద ఎత్తున తరలివస్తారు. వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన భక్తులు ముందుగా పవిత్ర గోదావరి నదిలో పుణ్యస్నానాలు ఆచరించి అమ్మవారిని దర్శించుకుంటారు. భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలుగకుండా ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. బాసర సరస్వతీ అమ్మవారిని మూల నక్షత్రంలో దర్శించుకుంటే కోరిన కోరికలు తీరుతాయని భక్తుల ప్రగాఢ నమ్మకం. ఈ నక్షత్రం నవరాత్రుల్లో రావడం విశేషం. ఇందు కోసం ఆలయ అధికారులు అన్ని ఏర్పాట్లు చేశారు. భక్తులు తమ చిన్నారులకు పెద్ద సంఖ్యలో అక్షరశ్రీకారాలు జరిపిం చనున్నారు. జిల్లావ్యాప్తంగా మహిళలు ఎంతో భక్తిశ్రద్ధలతో సామూహిక కుంకుమార్చన పూజలు చేస్తారు.

# నగర ప్రణాళికకు పాతరేసిన పాలకులు

## మురుగునీటి వ్యవస్థ నిర్వహణ అస్తవ్యస్థం

## చెరువుల కబ్జాతో పట్టణీకరణ సరికాదు

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): నగరాభివృద్ధి సమగ్రంగా ఉండాలే తప్ప అడ్డదిడ్డంగా ఉండరాదన్నారు. అభివృద్ధి పేరిట సహజ వనరులను నాశనం చేయకూడదు. పార్కులు, చెరువులు కాపాడుకోవాలని ప్రస్తుత విప్తుత మరోమారు మనలను మెచ్చరించిందన్నారు. వరద నీటి నిర్వహణ సరిగా జరగాలంటే నీటి కుంటలు, పచ్చదనం కూడా సరిగ్గా ఉండాల్సిందే. పట్టణ ప్రణాళికలో సహజ స్పాంజ్‌లుగా నిలిచేవి చెరువులే ! భూగర్భంలో నీరు పెరగడానికీ ఇవి దోహదం చేస్తాయన్నారు. పటిష్ఠమైన మురుగునీటి పారుదల వ్యవస్థ ఉండాలని,అప్పుడే నగరాల్లో ఆహ్లాదంగా ఉండగలమన్నారు. ఉపరితల నీటి నిర్వహణ మెరుగ్గా ఉండి, భూగర్భ జలాలను పరిరక్షించు కుంటే ఫలితాలు కూడా ఉత్తమంగా ఉంటాయన్నారు. కానీ పాలకులుగా ఎవరున్నా వీటిని పట్టించుకోవడం లేదు. నీటిపారుదల, మురుగునీటి శాఖలు సమన్వయంతో పనిచేస్తేనే నగర పరిరోణ సాధ్యమవుతుంది. నగరంలో మునకలకు కారణం ఈ క్యాచ్‌మెంట్ ఏరియాలలో సైతం భవంతులు రావడమని అన్నారు. పట్టణ ప్రణాళికలో వర్షపాతాన్ని కూడా పరిగణనలోకి తీసుకుని అందుకనుగుణంగా ప్రణాళిక చేయాల్సి ఉంటుందన్నారు. కనీసం 100 సంవత్సరాల భవిష్యత్‌ను దృష్టిలో పెట్టుకుని పట్టణ ప్రణాళిక చేస్తేనే కొంతమేరకు సత్ఫలితాలు వస్తాయని పురుషోత్తం రెడ్డి అన్నారు. హైదరాబాద్ చెరువులన్నీ ఇప్పుడు కబ్జాలకు గురై కాలనీలుగా మారిపోయాయి. దీంతో కాస్తంత వర్షానికే హైదరాబాద్ మహానగరం ఒక భారీ చెరువుగా మారిపోతోందన్నారు. రెండు రోజులుగా కురిసిన వర్షాలకు నగరం అతలాకుతలమైన తీరే ఇందుకు నిదర్శనం. నాలాలు, కుంటల ఆక్రమణ.. నిజాంల కాలం నాటి మురుగునీటి పారుదల వ్యవస్థపైనే ఇంకా ఆధారపడటం వంటి తప్పిదాలు ఈ దుస్థితికి కారణమన్నారు. నగరీకరణతో నగర స్వరూపం సమూలంగా మారిపోవడం, చెరువులను ఆక్రమించి నిర్మాణాలు చేపట్టడం వల్ల నీటి పారుదల, డ్రైనేజీ వ్యవస్థలపై భారం పడి కాస్తంత వానకే నగం విలవిలలాడుతోంది. అభివృద్ధి పేరిట ప్రకృతిని చెరపట్టడం.. దానివల్ల కలిగే నష్టాలను అంచనా వేసి అందుకనుగుణంగా తగిన జాగ్రత్తలు తీసుకోకపోవడవే ఈ మునకలకు కారణమన్నది గుర్తించాలని ఆయన అన్నారు. విశ్వనగరంగా ఖ్యాతికెక్కిన భాగ్యనగరంతో పోలిస్తే ఎంతో మెరుగైన అభివృద్ధిని సాధించినప్పటికీ అత్యుత్తమ డ్రైనేజీ వ్యవస్థలు కలిగిన అంతర్జాతీయ నగరాల స్థాయిలో మనం పోటీపడలేదన్నారు. ప్రపంచవ్యాప్తంగా సగం మందికి పైగా పట్టణాల లోనే జీవిస్తున్నారు. పెరుగుతున్న జనాభాకు అనుగుణంగా నగరాభివృద్ధి కూడా జరుగుతుంది. కానీ పట్టణాలకు చుట్టూ ఉన్న చెరువుల ఆక్రమణల కారణంగా వరదలతో ప్రజలు ఇబ్బంది పడడమే గాకుండా సమస్యలు ఎదుర్కొంటున్నారని ప్రొఫెసర్ పురుషోత్తంరెడ్డి అన్నారు.

# ఇంద్రకీలాద్రిపై శరన్నవరాత్రి ఉత్సవాల సందడి

## ఆదిపరాశక్తి రూపమే అమ్మవారు

## భారీగా ఏర్పాట్లు చేసిన అధికారులు

విజయవాడ,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): ఇంద్రకీలాద్రిపై దసరా శరన్నవరాత్రి ఉత్సవాల సందడి మొదల వుతోంది. శనివారం నుంచి ఈ నెల 25వ తేదీ వరకు ఈ ఉత్సవాలు జరగనున్నాయి. మొత్తం పది అలంకారాల్లో దుర్గమ్మ భక్తులకు దర్శనమివ్వనుంది. దసరా రోజున ఎంతమంది భక్తులను అనుమతించాలన్నదానిపై అధికారులు కసరత్తు చేస్తున్నారు. కరోనా వైరస్ కారణంగా భక్తుల సంఖ్య కుదించేందుకు ఆంక్షలను కఠినతరం చేయనున్నారు. అణువుల నుంచి బ్రహ్మాండాల వరకూ వ్యాపించిన విశ్వరూపిణి, విజయ వినోదిని ఆదిపరాశక్తి. ఒకరు కాదు, ఇద్దరు కాదు.. అమ్మల రూపంలో సమస్త మానవాళిని పులకింపజేయడానికి ఆ జగజ్జననియే తరలి వస్తున్న శుభవేళయే దసరా శరన్నవరాత్రులు. ఆశ్వీయుజ మాసం తొలి రోజుల్లో జరిగే ఈ రెండు వేడుకల్లోనూ కోట్లాది మందితో ఆరాధనలు అందుకొనే దైవం ఒక స్త్రీమూర్తి కావడం విశేషం. ఆమెనే సకల జగముల నేలే జగదాంబ. ప్రతీ ఒక్క మానవ మాత్రునికీ అత్యంత విశిష్ఠమని చెప్పాలి. అమ్మవారిని రోజూ నిష్టగా పుల రూపాల్లో పూజించడంతో పాటు నైవేద్యాలు సమర్పించి ఆరదాధించడం ఈ పండగ ప్రత్యేకత. వర్షఋతువు తర్వాత వచ్చే శరదృతువు అంటేనే వెన్నెల కాచే చల్లని సమయం. దేవీ నవరాత్రులను కూడా ప్రతీ హైందవ సమాజమూ అత్యంత భక్తి ప్రపత్తులతో జరుపుకుంటుంది. ఎందుకంటే, దుర్గాదేవి , అమ్మల గన్న యమ్మ ముగ్గురమ్మల మూలపుటమ్మ అన్నా.. ఎవరో కాదు, ఆ ఆదిపరాశక్తే. నమ్మిన వారికి, దైవిక సిద్ధాంతాన్ని ఆచరించే వారికి ఆమె అనేక రూపాలలో దర్శనమిస్తుంది. ఈ శక్తి కూడా అనేక రూపాలలో కనిపిస్తున్నది. అనంత విశ్వం మహాశక్తిపైనే ఆధారపడి ఉంది. భారతీయ ధర్మశాస్త్రాలు ప్రతీ స్త్రీమూర్తినీ శక్తికి ప్రతీకగా అభివర్ణించాయి. ఆ మాటకొస్తే అవి నారీమణులను పూజ్యనీయుల జాబితాలోకే చేర్చాయి. త్రిమూర్తులను, త్రిమాతలను, ఇంకా మొత్తంగా దేవతల గణాన్నందరినీ సృష్టించింది ఆదిపరాశక్తియే. ఒక్కమాటలో చెప్పాలంటే, ఆమెనే యావత్ సృష్టికి కర్త కర్మ క్రియ. కాబట్టి, సర్వశక్తులకూ కేంద్రస్థానం ఈ మహాశక్తి. సృష్టికర్త, సంరక్షకురాలు, దుష్ట వినాశనకారి సర్వం ఆమెనే అని దేవీ భాగవత పురాణం పేర్కొన్నది. ఏడు సింహాలతో కూడిన రత్నాల సింహాసనంపైన ఆదిశక్తి కూర్చుని ఉండడాన్ని త్రిమూర్తులు చూసినట్లు అందులో ఉందని వేదపండితులు చెప్తారు. ఆదిబీజమే (ఆదివరాశక్తి) తనంతట తాను పురుషుడుగా, ప్రకృతి (స్త్రీ)గా విభజితమైనట్లు అష్టాదశ పురాణాలలో ప్రధానమైన బ్రహ్మ పురాణం తెలిపింది. దేవీ భాగవతం ప్రకారం శక్తిలోని శకు ఐశ్వర్యమని, క్తికి పరాక్రమమని అర్థం చెప్పారు. సృష్టి ఆరంభంలో ఒక్క దేవి మాత్రవే ఉందని, ఆమెయే ఈ బ్రహ్మాండాలన్నింటినీ సృష్టించిందని బహ్వృచోపనిషత్‌లోనూ కనిపిస్తుంది. ఆమె నుండే త్రిమూర్తులు, సర్వమూ ఉద్భవించినట్టు కూడా అందులో ఉంది. ఎప్పుడైతే భూమిమీద దానవత్వం పెరుగుతుందో అప్పుడు తాను అవతరించి దుష్టశిక్షణ జరుపుతానని జగజ్జని అన్నట్టు దేవీసప్తశక్తి పేర్కొంటున్నది. శక్తి ఆరాధనను ఏదో ఒక మతానికో, వర్గానికో పరిమితం చేయనవసరం లేదు. విశ్వంలో కనిపించని శక్తులూ ఇంకా శాస్త్రవేత్తల మేధకు, విజ్ఞాన శాస్త్రాలకు అందకుండానూ ఉన్నాయి. అవన్నీ మహావిశ్వంలో భాగవే అయినప్పుడు, మానవాళికి సర్వతోముఖాభివృద్ధికి అవన్నీ ఉపయోగపడుతున్నప్పుడు వాటిని శక్తిరూపంలో ఆరాధించడంలో తప్పులేదు.జగత్తులన్నింటికీ మూలమైన భగవంతుణ్ని సైతం సృష్టించింది భగవతి అయిన ఈ పరాశక్తియే. ఇంతేకాదు, ప్రతీ అణువణువులోని ప్రాణశక్తికి, ఆత్మయిక జీవుల్లో నిగూఢంగా ఉండే కుండలినీ శక్తులకూ, పరమాత్మలోని యోగ-మహామాయలకు.. అన్నింటికీ ఆదిమూలమూ ఆమెనే అని ఆధ్యాత్మిక వేత్తలు అంటారు. ఆ మహాశక్తి విశ్వరూపంలో మన దర్శనానికి అందింది అత్యల్పం. కాబట్టి, ప్రతి ఒక్కరూ అహాన్ని పక్కన పెట్టి శక్తి ఆరాధనకు సంసిద్ధులు కావాలి.

# వాయు కాలుష్యానికి కారకాలు ఎన్నో

## జవదేకర్ వ్యాఖ్యలపై కేజ్రీవాల్ అసహనం

న్యూఢిల్లీ,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): దేశ రాజధాని నగరంలో వాయు కాలుష్యంపై కేంద్ర మంత్రి ప్రకాశ్ జవదేకర్ వ్యాఖ్యలను ఢిల్లీ ముఖ్యమంత్రి అరవింద్ కేజ్రీవాల్ ఖండించారు. గాలి కలుషితమవడానికి వరి దుబ్బులను కాల్చడం మాత్రమే కాకుండా ఇతర కారణాలు ఎక్కువగా ఉన్నాయని జవదేకర్ చెప్పడాన్ని తప్పుబట్టారు. ఈ విధంగా తిరస్కార ధోరణితో ఉండటం వల్ల ప్రయోజనం ఉండదని చెప్పారు. గాలి కాలుష్యంలో కేవలం 4 శాతం మాత్రమే వరి దుబ్బుల కాల్చివేత వల్ల జరుగుతోందని, మిగిలిన కాలుష్యానికి ఇతర కారణాలు ఉన్నాయని కేంద్ర పర్యావరణ శాఖ మంత్రి ప్రకాశ్ జవదేకర్ అన్నారు.

బయోమాస్ బర్నింగ్, గార్బేజ్ డంపింగ్, సక్రమంగా లేని రోడ్లు, దుమ్ము, ధూళి, భవన నిర్మాణ పనులు, కూల్చివేత పనులు వంటివాటి వల్ల గాలి కలుషితమవుతోందన్నారు. దీనిపై కేజ్రీవాల్ స్పందిస్తూ ట్విటర్ వేదికగా జవదేకర్‌ను నిలదీశారు. గడచిన పదిహేను రోజుల్లో ఢిల్లీ- దేశ రాజధాని ప్రాంతంలో అకస్మాత్తుగా కాలుష్యం ఎందుకు పెరిగిందని ప్రశ్నించారు. లేదు లేదంటూ కూర్చోవడం వల్ల ప్రయోజనం ఉండదు. వరి దుబ్బుల కాల్చివేత కేవలం 4 శాతం కాలుష్యానికే కారణమైతే, గత 15 రోజుల్లో అకస్మాత్తుగా కాలుష్యం ఎందుకు పెరిగింది? అంతకుముందు గాలి పరిశుభ్రంగా ఉండేది. ప్రతి సంవత్సరం ఇదే పరిస్థితి. ఈ పెరుగుదలకు స్థానిక కాలుష్య కారకాల్లో ఏదీ గత కొద్ది రోజుల్లో భారీగా పెరగలేదని కేజ్రీవాల్ చెప్పారు.

# ఖమ్మం నగరంలో బస్ షెల్టర్స్ ప్రారంభించిన మంత్రి

ఖమ్మం,అక్టోబర్16 : ఖమ్మం నగరంలోని ఇట్ హబ్ సెంటర్, కలెక్టరేట్ సెంటర్, ఇల్లందు సర్కిల్లో నూతనంగా నిర్మించిన బస్ షెల్టర్స్, ట్రాఫిక్ ఆమ్బ్రేల్లాలను రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ ప్రారంభించారు. కార్యక్రమంలో మేయర్ పాపాలాల్, ఎమ్మెల్సీ బాలసాని లక్ష్మీ నారాయణ, జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజ్, ఎమ్మెల్యే రాములు నాయక్, సుడా చైర్మన్ విజయ్ కుమార్, జిల్లా కలెక్టర్ ఆర్వీ కర్ణన్, ట్రైనీ ఐఏఎస్ వరుణ్ రెడ్డ, డిప్యూటీ మేయర్ బత్తుల మురళి , గ్రంథాలయ సంస్థ చైర్మన్ ఖమర్, కార్పొరేటర్లు తదితరులు ఉన్నారు.



ఖమ్మం నగరంలో కొత్తగా నిర్మించిన బస్ షెల్టర్లను ప్రారంభించిన సందర్భంగా జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ తదితరులు

# రైతన్నలకు అండగా ఉంటాం : మంత్రి పువ్వాడ

ఖమ్మం, అక్టోబర్ 16: అకాల వర్షంతో పంట నష్టపోయిన రైతులకు రాష్ట్ర ప్రభుత్వం అండగా నిలుస్తుందని రవాణా శాఖ మంత్రి పువ్వాడ అజయ్ కుమార్ అన్నారు. వానకాలం పత్తి, వరి పంటల కొనుగోలుపై ఖమ్మం డీపీఆర్సీ భవనంలో జిల్లా ఉన్నతాధికారులతో సమీక్ష నిర్వహించి మాట్లాడారు. జిల్లాలో వేలాది ఎకరాల్లో వరి, పత్తి పంటలకు నష్టం వాటిల్లిందన్నారు. క్షేత్ర స్థాయిలో అధికారులు పర్యటించి వివరా లను సేకరించాలన్నారు. వచ్చే దసరా నాటి కి జిల్లాలో ని 229 రైతు వేదికలను ప్రార ంభించను న్నట్లు ఆయన పేర్కొన్నారు .రైతు వేదికల నిర్మాణంలో అలసత్వం వహించే సర్పంచ్‌ల పై చర్యలు తీసుకుంటా మని హెచ్చరించారు. పంట నష్టపోయిన రైతులను ఆదుకుంటామని పేర్కొన్నారు. కార్యక్రమం లో సతుపల్లి, పాలేరు, వైరా ఎమ్మెల్యేలు సండ్ర వెంకటవీరయ్య, కందాల ఉపేందర్ రెడ్డి, ఎల్ రాములు నాయక్, జడ్పీ చైర్మన్ లింగాల కమల్ రాజు, డీసీసీబీ, డీసీఎం ఎస్ చైర్మన్లు నాగభూషణం, శేషగిరి రావు, రైతు బంధు సమితి జిల్లా కన్వీనర్ వెంకటేశ్వ రరావు, జిల్లా కలెక్టర్ ఆర్వి కర్ణన్ పలువురు అధికారులు పాల్గొన్నారు.

# ముంపు ప్రభావిత ప్రాంతాలకు శాశ్వత పరిష్కారం

## -పలు ప్రాంతాల్లో పర్యటించిన మంత్రి తలసాని

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): ఎన్నో సంవత్సరాలుగా ముంపు ప్రభావిత ప్రాంతాల ప్రజలు ఎందుర్కొంటున్న పలు సమస్యలకు శాశ్వత పరిష్కారం చూపే దిశగా ప్రభుత్వం చర్యలు చేపడుతుందని పశుసంవర్ధక, మత్స్య, పాడి పరిశ్రమల అభివృద్ధి శాఖల మంత్రి తలసాని శ్రీనివాస్ యాదవ్ వెల్లడించారు. గత రెండు రోజులుగా కురుస్తున్న వర్షాలతో వరదనీటి ముంపుకు గురైన పలు ప్రాంతాలలో మంత్రి శ్రీనివాస్ యాదవ్ గురువారం పర్యటించారు. ముందుగా ఖైరతాబాద్ నియోజకవర్గ పరిధిలోని ఎంఎస్ మక్తా ప్రాంతాలలో ఎంఎల్ఏ దానం నాగేందర్, కార్పొరేటర్ విజయా రెడ్డిలతో కలిసి పర్యటించారు. ఎన్నో సంవత్సరాలుగా తాము వర్షాకాలంలో ఇలాంటి సమస్యలను ఎదుర్కొంటున్నామని మంత్రికి వివరించగా, స్పందించిన మంత్రి వెంటనే ముంపు ప్రాంతాలలోని ఇండ్ల నుండి ప్రజలను బయటకు తీసుకెళ్లేందుకు 2 బోట్ లను తెప్పించారు. ఈ ప్రాంత ప్రజలు వ్యాధుల భారిన పడకుండా వెంటనే నివారణ కు మందులను స్ప్రే చేయాలని అధికారులను ఆదేశించారు. వరదనీటిని పూర్తిస్థాయిలో తరలించి విద్యుత్ సరఫరాను పునరుద్దరించేందుకు చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. 10 రోజులలలో అధికారులతో సమావేశం నిర్వహించి సమస్యకు శాశ్వత పరిష్కారం చూపుతామని మంత్రి స్థానిక ప్రజలకు హామీ ఇచ్చారు. మక్తా లో సరైన డ్రైనేజి వ్యవస్థ లేకపోవడం వలన వర్షపు నీరు నిలిచిపోయి తీవ్ర ఇబ్బందులు పడుతున్నామని మంత్రికి వివరించగా, వెంటనే డ్రైనేజి లైన్ నిర్మాణానికి చర్యలు తీసుకోవాలని వాటర్ వర్క్స్ అధికారులను ఆదేశించారు. అనంతరం అక్కడ నుండి బేగంపేటలోని బ్రాహ్మణవాడిలో కార్పొరేటర్ ఉప్పల తరుణితో కలిసి పర్యటించారు. పక్కనే ఉన్న నాలాలో పూడిక పేరుకపోయిన కారణంగా వర్షపు నీరు తమ కాలనీలోకి చేరుతుందని స్థానిక ప్రజలు మంత్రికి పిర్యాదు చేశారు. నాలాలో సిల్ట్ తొలగించడంతో పాటు రిటైనింగ్ వాల్ వెంట డ్రైనేజి పైప్ లైన్ నిర్మించి ప్రకాష్ నగర్ నాలా లో కలిపితే ఈ సమస్య పరిష్కారం అవుతుందని స్థానికులు మంత్రికి వివరించారు. సమస్య పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధ్యయనం చేయాలని మంత్రి సంబంధిత అధికారులను ఆదేశించారు. బాధిత కుటుంబాలకు త్రాగునీరు, పాలు, ఆహారం అందించేలా చర్యలు తీసుకోవాలని మంత్రి అధికారులను ఆదేశించారు. అనంతరం ముషీరాబాద్ నియోజకవర్గ పరిధిలోని మారుతీనగర్ లో ఎంఎల్ఏ ముఠా గోపాల్ తో కలిసి పర్యటించారు. హుస్సేన్ సాగర్ నుండి దిగువకు నీరు వెళుతున్న నాలా వెంట ఉన్న ఇండ్లను పరిశీలించి ఎలాంటి ప్రమాదాలు చోటుచేసుకోకుండా ముందస్తుగా తగు చర్యలు చేపట్టాలని అధికారులను ఆదేశించారు.

# మహిళలను వేధిస్తే కఠిన చర్యలు తప్పవు

## తల్లిదండ్రులతో పాటు పోకిరీలకు కౌన్సిలింగ్

## అప్రమత్తంగా ఉండాలని స్వాతి లక్రా హెచ్చరిక

హైదరాబాద్,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): తెలంగాణలో మహిళలను వేధించే ఆకతాయిలకు తగిన బుద్ధ ఇచెబుతామని షీ టీమ్స్ అదిపతి స్వాతి లక్రా ప్రకటించారు. ఎవరిని కూడా వదిలేది లేదని హెచ్చరించారు. భద్రతా విభాగం రాష్ట్ర వ్యాప్తంగా మహిళలను వేధించిన , సోషల్‌మీడియా వేదికలపై మహిళలపై అనుచిత వ్యాఖ్యలు చేయడమో, ఇతర మార్గాలలో యువతులను వేధింపులకు పాల్పడిన 200 మందికిపైగా ఆకతాయిలను గుర్తించి వారికి మహిళా విభాగం ప్రధాన కార్యాలయం నుంచి ఆన్‌లైన్ కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ కౌన్సెలింగ్ ముఖ్యోద్దేశం తప్పుచేసిన వారిలో మార్పు తీసుకు రావడమేనని అధికారులు తెలిపారు. ఈ సందర్భంగా మహిళా భద్రతా విభాగం అడిషనల్ డీజీపీ స్వాతి లక్రా మాట్లాడుతూ వేధింపులకు పాల్పడిన వారు ఇక మీదట జాగ్రత్తగా ఉండాలని, ఏదైనా పోలీసులు కొంత మేరకే భరించగలరని హద్దుమీరితే కఠిన చర్యలు తప్పవని ఆమెహెచ్చరించారు. ఆకతాయిల తల్లిదండ్రులు కూడా ఈ కౌన్సెలింగ్‌లో హాజరుకావడంతో వారికి కూడా పలు సూచనలు చేసినట్టు తెలిపారు.పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు తల్లిదండ్రులు గమనిస్తుండాలని మీరు చేసిన తప్పులే వేరేరు మీ పిల్లలపై చేస్తే ఎలా ఉంటుందని ఆమె ప్రశ్నించారు. మహిళలను గౌరవించాలని కోరారు. కౌన్సిలింగ్‌లో పాల్గొన్న మహిళా భద్రతా విభాగం డీఐజీ సుమతి మాట్లాడుతూ దేశంలో ఈ విధమైన కౌన్సెలింగ్‌కి ఒక విధాన మంటూ లేదని, మన రాష్ట్రంలోనే ఒక మోడల్ కౌన్సెలింగ్ రూపొందించి ఇటువంటి తప్పిదాలకు పాల్పడిన వ్యక్తులను మార్చ గలుగుతున్నామని చెప్పారు. దీనికి అన్ని జిల్లాల షీ టీమ్‌లు చేస్తున్న కృషి మరువలేనిదని చెప్పారు. ప్రతి జిల్లా షీటీమ్ మహిళల సమస్యపట్ల చాలా వేగంగా స్పందిస్తున్నారని ఇదే కొనసాగించాలని అన్నారు. అలాగే కొన్ని కౌన్సెలింగ్‌లో ప్రముఖ సైకాలజిస్టులు కూడా పాల్గొని బాధ్యులకు కౌన్సెలింగ్ ఇచ్చారు. ప్రముఖ విద్యావేత్త, ఫ్లేమ్ వ్యవస్థాపకులు డాక్టర్ ఇందిరా పారిఖ్ కూడా పాల్గొని బాధ్యుల్లో మార్పునకు కొన్ని సూత్రాలు చెప్పారు.

# ఉజ్జయినీలో దారుణ ఘటన

## కల్తీ మద్యం తాగా 11మంది మృతి

## విచారణకు ఆదేశించిన సిఎం చౌహాన్

భోపాల్,అక్టోబర్15(ఆర్ఎన్ఎ): ఉజ్జయిని నగరంలో కల్తీ మద్యానికి 11 మంది బలయ్యారు. కల్తీ మద్యం సేవించిన దినసరి కూలీలు మృత్యువాత పడ్డారు. గురువారం ఉదయం ఏడుగురు మరణించగా.. మరో రెండు మృతదేహాలను ధాబా రోడ్ ప్రాంతంలోని నర్సింగ్ ఘాట్ వద్ద కనుగొన్నారు. దవాఖానలో చికిత్స పొందుతూ ఇద్దరు చనిపోయారు. మృతుల్లో 10 మంది కూలీలు ఉన్నారు. వీరంతా ఫుట్‌పాత్‌పై నివసిస్తూ దినసరి కూలీలుగా పనిచేసుకుంటూ పొట్టపోసుకుంటున్నారు. కల్తీ మద్యం కేసులో ఇప్పటివరకు ఎనిమిది మందిని పోలీసులు అరెస్టు చేశారు. కాగా, కల్తీ మద్యం జోరుగా సాగేందుకు నిర్లక్ష్యం ప్రదర్శించిన ఖరాకువాన్ పోలీస్ స్టేషన్ ఇంచార్జి ఎంఎల్ మీనా, ఎస్ఐ నిరంజన్ శర్మ, కానిస్టేబుల్ షేక్ అన్వర్, నవాజ్ షరీఫ్‌లను ఉన్నతాధికారులు సస్పెండ్ చేశారు. ఉజ్జయిని పాత నగరంలోని ఖరాకువాన్, మహాకల్, కొత్వాలి పోలీస్ స్టేషన్లలో బుధవారం రాత్రి ఆరుగురు కార్మికులతో పాటు ఏడుగురు మృతిచెందారు. కార్మికులు ఛత్రిచౌక్, ఖరాకువాన్ గాలి, తేలివాడ, బేగంబాగ్ ప్రాంతానికి చెందిన వారుగా గుర్తించారు. పోస్టుమార్టం నివేదిక, పోలీసుల దర్యాప్తులో విషపూరిత మద్యం సేవించడం వల్ల మరణాలు సంభవించినట్లు తేలింది. గురువారం ఉదయం మరో ఇద్దరు కార్మికుల మృతదేహాలను కనుగొన్నట్లు పోలీసులు దర్యాప్తు చేస్తున్నారు. అదే సమయంలో దవాఖానలో చికిత్స పొందుతూ మరో ఇద్దరు మరణించారు. ఛత్రిచౌక్ ప్రాంతంలో ఉన్న మల్టీ-లెవల్ పార్కింగ్ స్థలంలో కొంతమంది రసాయనాలు, స్పిరిట్ తదితరాలను వినియోగించి విషపూరిత మద్యం తయారు చేసి రూ.20-30 కు అమ్ముతున్నట్లు ఇప్పటివరకు జరిగిన పోలీసు దర్యాప్తులో తేలింది. ఈ రసాయన తయారీ మద్యాన్ని ఎక్కువగా దినసరి కూలీలు, సన్యాసులు కొనుగోలు చేసి వినియోగించేవారని పోలీసులు గుర్తించారు. అరెస్టయిన ఎనిమిది మందిని పోలీసులు ప్రశ్నిస్తున్నారు.

ఉన్నత స్థాయి దర్యాప్తుసకు సీఎం ఆదేశం

కల్తీ మద్యం కేసు దర్యాప్తు జరిపేందుకు సిట్ ఏర్పాటు చేసినట్లు మధ్యప్రదేశ్ ముఖ్యమంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ తెలిపారు. ఉన్నత స్థాయి విచారణకు సూచనలు ఇచ్చారు. కల్తీ మద్యాన్ని అరికట్టడంలో శివరాజ్ సింగ్ ప్రభుత్వం ఘోరంగా విఫలమైందని మాజీ ముఖ్యమంత్రి కమల్‌నాథ్ అన్నారు. కల్తీ మద్యం మాఫియాను కాంగ్రెస్ ప్రభుత్వం కట్టడిచేసిందని, అయితే ప్రస్తుత ప్రభుత్వం నిమ్మకునీరెత్తినట్లుగా ఉండటంతో కల్తీ మద్యం ఏరులై పారి పేదల ప్రాణాలు తీస్తుందని ఆరోపించారు.

# టివి ఛానల్‌కు బ్యాడ్ న్యూస్

## -టిఆర్‌పి రేటింగ్స్ 12 వారాలపాటు నిలిపివేత

న్యూఢిల్లీ,అక్టోబర్16(ఆర్ఎన్ఎ): టెలివిజన్ చానల్స్‌కు వివర్‌షిప్స్ ఆధారంగా రేటింగ్స్ ఇచ్చే పక్రియను 12 వారాల పాటు నిలిపివేస్తున్నట్లు బ్రాడ్‌కాస్ట్ ఆడియెన్స్ రీసర్చ్ కౌన్సిల్ బార్క్ పేర్కొంది. ఇంగ్లీష్, హిందీ సహా అన్ని స్థానిక ఛానల్స్, బిజినెస్ న్యూస్ ఛానల్స్‌పై ఈ ప్రభావం ఉండనున్నట్లు బార్క్ తెలిపింది. ఇప్పటికే విడుదల కావాల్సిన వారాంతపు రేటింగ్స్‌ని బార్క్ నలిపివేసింది. ఇటీవల వెలుగు చూసిన పరిణామాల ప్రకారం.. సముచిత శైలిలో డేటాను గణించడం, నివేదించడం లాంటి సాంకేతిక అంశాల ప్రమాణాలను మరింత పెంచే పనిలో బోర్డు ఉంది. అందువల్లనే వారాంతపు రేటింగ్స్‌ని విడుదల చేయ లేదు. అంతే కాకుండా మరో 8-12 వారాల పాటు కూడా రేటింగ్స్ ఉండవని బార్క్ టెక్నికల్ కమిటీ పేర్కొంది. బార్క్ నిర్ణయాన్ని న్యూస్ బ్రాడ్‌కాస్ట్ అసోసియేషన్ ఎన్‌బీఏ స్వాగతించింది. ఇటీవలో ప్రసార మాధ్యమాలపై ఇచ్చిన నివేదికలు ఏజెన్సీకి అపఖ్యాతిని తెచ్చిపెట్టాయి. అవినీతి,రాజీపడేతత్వం, సంబంధం లేని డేటా, ఇండియా ఏం చేస్తుందనే విషయంపై తప్పుడు సంకేతాలను ఇస్తోంది. అంతే కాకుండా ఇది మన సభ్యుల ఎడిటోరియల్‌పై జర్నలిస్టు విలువలపై ఇది తీవ్రమైన ప్రభావాన్ని చూపిస్తోందని ఎన్‌బీఏ అధ్యక్షుడు రజత్ శర్మ అన్నారు.

